RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 357 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 జనవరి 2025 శుక్రవారం పేజీలు : 4

### అత్యధిక జనాభా గల నగరం.. ప్రయాగ్‌రాజ్

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా జనసంద్రంతో హోరెత్తిపోతోంది. 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అరుదైన మహా కుంభం కావడంతో దేశవిదేశీ భక్తులు, సాధువులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. జనవరి 16 పుష్య పౌర్ణమి భోగి పండుగ నాడు కుంభమేళా ప్రారంభం కాగా.. మకర సంక్రాంతి రోజున రికార్డు స్థాయిలో భక్తులు త్రివేణి సంగమానికి హాజరయ్యారు. ఇసుక వేసినా రాలదనే స్థాయిలో ఆ ప్రాంతమంతా భక్తకోటితో కిక్కిరిపోయింది. దీంతో.. ప్రయాగ్‌రాజ్ జనాభా ఒక్కసారిగా విపరీతంగా పెరిగిపోయింది. ఆ ఒక్కరోజునే ఏకంగా 4 కోట్ల మందికిపైగా ప్రజలు ప్రయాగ్‌రాజ్‌లో అమృత స్నానాలు చేసినట్లు ప్రభుత్వ నివేదికలు వెల్లడించాయి. దీనికి తోడు జిల్లా జనాభా 70 లక్షలను కూడా కలుపుకుంటే..ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన నగరంగా ప్రయాగరాజ్ నిలిచినట్లైంది.

# గ్రామాల్లో 'స్థానిక' జోష్




## ఎప్పుడెడతారో పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం!

## సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చ!

## ఫిబ్రవరిలో ఎన్నికలంటూ ప్రచారం

## ప్రత్యేకంగా దృష్టి పెట్టిన రాజకీయ పార్టీలు

హైదరాబాద్ : ''సర్పంచ్ ఎన్నికలు ఫిబ్రవరిలో అంటున్నారు.. నిజమేనా.! బీసీలకు రిజర్వేషన్లను పెంచుతారా? ఈసారి మన ఊరు సర్పంచ్‌గిరీ ఎవరికి వస్తదో!" ప్రస్తుతం తెలంగాణ పల్లెల్లో రచ్చబండల దగ్గర జరుగుతున్న చర్చ ఇది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా ఇదే చర్చ. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా "ఎన్నికలు ఎప్పుడంటున్నారు?" అనే ప్రశ్నతోనే సంభాషణలు మొదలవుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పునకు సంబంధించి కూడా విస్తృత చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు మారితే తమ గ్రామాల్లో సర్పంచ్‌గా, మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీగా ఏ సామాజిక వర్గానికి అవకాశం వస్తుందనే దానిపైనా బేరీజు వేస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వం కూడా స్థానికంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం గ్రామం, మండల స్థాయిలో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీల వారీగా ఎవరి వర్గాలను వారు బలోపేతం చేసుకుంటున్నారు. ఓటర్ల జాబితాలపైనా ప్రత్యేక దృష్టి పెడుతూ.. ప్రస్తుతం జాబితాలో ఎవరెవరు ఉన్నారు? ఎన్నికల నాటికి కొత్తగా ఓటు హక్కు వచ్చేవారు ఎవరైనా ఉన్నారా? అనేదానిపై గ్రామాల్లో తూర్పార పడుతున్నారు. మొత్తంగా రాష్ట్రంలో సంక్రాంతి కంటే ముందే స్థానిక జోష్ మొదలైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. క్షేత్రస్థాయిలోనూ ఇదే తంతు మొదలైంది. ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ పథకం అందరికీ అందలేదని, స్థానిక ఎన్నికల కోసమే సంక్రాంతి నుంచి రైతు భరోసా, కూలీలకు రూ.12వేల సాయం అందిస్తామంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో పార్టీల నడుమ మాటల మంటలు రాజుకుంటున్నాయి.

**రిజర్వేషన్ల మార్పుపై ఆసక్తి..** తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి 10నెలలు అవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తయి 7నెలలు అవుతోంది. వాస్తవానికి ఆయా పదవుల కాలం అయిపోయేనాటికే ఎన్నికలు జరిగి కొత్తవారు ఎన్నిక కావాల్సి ఉంది. కానీ, రాష్ట్రంలో గత ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు, ఆ వెంటనే లోక్‌సభ ఎన్నికలు జరగడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42శాతం పెంచుతామంటూ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిషన్(బీసీ డెడికేటెడ్ కమిషన్) బీసీల రిజర్వేషన్‌పై ప్రభుత్వానికి సమగ్ర నివేదికను అందించనుంది. అనంతరం రిజర్వేషన్ల కేటాయింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అయితే ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా.. ఏ కులానికి ఎంత రిజర్వేషన్ కేటాయించినా.. అన్నీ కలిపి 50శాతానికి మించకూడదు. దాంతో ఈసారి స్థానిక ఎన్నికల్లో ఏ సామాజిక వర్గం వారికి ఎంత మేర అవకాశాలు లభించనున్నాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ సహా టీ కాంగ్రెస్ కీలక నేతల భేటీ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కీలక సమావేశం జరిగింది. సీఎం రేవంత్ సహా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక భేటీ జరిగింది. రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన, పథకాల అమలుపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో తాజా పరిణామాలపైనా చర్చించారు. కాగా, ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ సహా తెలంగాణ కాంగ్రెస్ నేతలు హాజరైన విషయం తెలిసిందే.

**ఫిబ్రవరిలో తెలంగాణకు రాహుల్...** ఫిబ్రవరి తొలి లేదా రెండో వారంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటిస్తారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కేసీ వేణుగోపాల్ తో కాంగ్రెస్ నేతల భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభ ఉండే అవకాశం ఉందని మహేశ్ కుమార్ తెలిపారు. ఈ నెలాఖరులోపు నామినేటెడ్, కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీ ఉంటుందన్నారు. కేబినెట్ విస్తరణపై సీఎం, అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చించామన్నారు. ప్రజల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలకే డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వడం జరుగుతుందని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.




## కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డికి నాయకుల నివాళి



హైదరాబాద్: దివంగత నేత, కేంద్ర మాజీమంత్రి జైపాల్ రెడ్డి 83వ జయంతిని పురస్కరించుకొని నెక్లెస్ రోడ్డులోని ఆయన ఘాట్ వద్ద నాయకులు, ప్రముఖులు నివాళి అర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జానారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజరై పూలతో శ్రద్ధాంజలి ఘటించారు.

# కేటీఆర్ అత్యుత్సాహం!




## పదేపదే అవే పొరపాట్లు!!

హైదరాబాద్ : రాజకీయాల్లో కానీ, న్యాయ సంబంధిత వ్యవహారాల్లో కానీ..... సంక్షోభం వస్తే దాన్నుంచి ఎంత త్వరగా బయటపడాలో ఆలోచించాలి తప్ప.... ఆ సంక్షోభంలో కూడా పబ్లిసిటీ కొట్టేద్దామని ఆలోచిస్తే పరిస్థితి కేటిఆర్ లాగే ఉంటుంది. ఈ కార్ రేస్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పుతో కేటీఆర్ నిండా మునిగిపోయారు. ఆయన చేసిన వ్యూహాత్మక తప్పిదాలు.... ఈ కేసులో కేటీఆర్కు అన్ని అవకాశాల్ని పోగొట్టాయి.

అన్ని దారులు మూసుకుపోయాయి. లొట్ట పీసు కేసు అంటూ ఎగతాళి చేసిన కేటీఆర్...ఆ కేసులోనే ఇప్పుడు నిండా మునిగిపోబోతున్నాడు. మాజీ మంత్రి కేటిఆర్ కు చివరి అవకాశం కూడా చేజారిపోయింది.. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో కేటిఆర్ క్వాష్ పిటిషన్ విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది... ఈ కేసులో అన్ని దారులు మూసుకుపోవడంతో ఇక కేటిఆర్ అరెస్టు తప్పేలా లేదు.ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటిఆర్ ఏ వన్ గా ఆయనపై కేసు నమోదు చేసిన ఏసీబీ . 54 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం లో కేటిఆర్ పాత్ర కీలకమని పేర్కొంది. ఏసీబీ FIR నమోదు చేసిన 24 గంటల్లోపే హైకోర్టును ఆశ్రయించారు కేటిఆర్.. తక్షణం అరెస్టు చేయవద్దు అని కోర్టు మొదట చెప్పడంతో స్వల్ప ఊరట లభించినా... ఆ తర్వాత అదే హైకోర్టులో అతనికి ఎదురుదెబ్బ తగిలింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్ ను కొట్టేసిన హైకోర్టు నిధుల దుర్వినియోగం జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని తన తీర్పులో అభిప్రాయపడింది. ఆ తర్వాత లాయర్ తో కలిసి కేటిఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. సుమారు ఏడు గంటలపాటు అతణ్ణి ప్రశ్నించిన ఏసీబీ స్టేట్మెంట్ రికార్డు చేసింది.అయితే నాలుగు ప్రశ్నల్ని నలభై సార్లు తిప్పి తిప్పి అడిగారని విచారణ పూర్తై బయటకొచ్చాక కేటిఆర్ చెప్పుకున్నారు.. మరోసారి ఏసీబీ పిలిచినా హాజరవుతానని చాలెంజింగ్ మూడ్ లో చెప్పారాయన.. అయితే ఏసీబీకి హాజరు కాకముందే, హైకోర్టు తీర్పు రాగానే, నిమిషాల్లో దానిని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు కేటిఆర్. అయితే అత్యవసరంగా అదేరోజు కేటీఆర్ క్వాష్ పిటిషన్ పై వాదన వినాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఇప్పుడు సుప్రీంకోర్టులో జస్టిస్ బేళా త్రివేది బెంచ్ విచారణ లో కేటీఆర్ క్వాష్ పిటిషన్ అంశం నాలుగు నిమిషాల్లోనే ముగిసిపోయింది.ఫార్ములా ఈ కార్ కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉన్నందున ఇప్పుడు జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు. కేటిఆర్ ను క్వాష్ చేసేందుకు ఎలాంటి గ్రౌండ్స్ కనపడడం లేదన్న జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం.... పిటిషన్ విచారణకు నిరాకరించింది.. పిటిషన్ ను డిస్మిస్ చేస్తామని బెంచ్ పేర్కొనడంతో దెబ్బకి విత్ డ్రా చేసుకుంటామని కేటిఆర్ లాయర్ చేతులెత్తేశాడు.

సుప్రీంకోర్టు ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో జోక్యానికి నిరాకరించడంతో ఇప్పుడు కేటిఆర్ కు అన్ని దారులూ మూసుకుపోయాయి.. ఇప్పుడు అతని ముందున్న ఆప్షన్స్ లో మొదటిది ఈడీ విచారణకు హాజరుకావడం.... రెండోది మరోసారి ఏసీబీ రమ్మంటే వెళ్ళడం. మూడోది ముందు జాగ్రత్త చర్యగా ముందస్తు బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయించడం.

కానీ హైకోర్టు, సుప్రీంకోర్టు క్వాష్ పిటిషన్ తిరస్కరించిన తర్వాత... కింది కోర్టుల్లో ముందస్తు బెయిలు రావడం కష్టమే. ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అత్యుత్సాహానికి పోయి పదేపదే పొరపాట్లు చేశారు. ఈ కేసు ద్వారా తన మైలేజ్ పొందాలని అనుకున్నాడు తప్ప ఎక్కడ సీరియస్ గా వర్క్ చేసినట్టు కనబడదు. ఏసీబీ కేసు నమోదు చేసిన 24 గంటల్లోపే ఎఫ్ఐఆర్ కొట్టివేయలని కేటిఆర్ హైకోర్టును ఆశ్రయించడం ఒక తప్పు.ఏసీబీ కార్యాలయానికి లాయర్ తో కలిసి వెళ్లాలని యాగీ చేయడం మరో తప్పు. విచారణలో ఏం జరిగిందో తెలియదు కానీ ఏసీబీ అధికారుల దగ్గర విషయం లేదని చెప్పడం ఇంకో తప్పు. హైకోర్టు తీర్పును వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేయడం తప్పు పై తప్పు.ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోకుండా సమయం వృధా చేసుకున్నాడు కేటీఆర్.

# సంపాదకీయం

## సిద్ధరామయ్య సీటు కదులుతోందా ?

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సీటుకు ఎసరు వస్తోందా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే అంటున్నారు. రాజకీయాల్లో పదవులు ఎంత తొందరగా వస్తాయో పోవడం కూడా అలాగే ఉంటుంది. అంతే కాదు కాంగ్రెస్ పార్టీలో సీఎంల సీటు చాలా ఈజీగా పోతూంటుంది అన్నది తెలిసిందే. ఇదిలా ఉంటే కర్ణాటకలో సీటు కోసం గతంలోనే పోటీ జరిగింది. కర్ణాటక శాసనసభకు 2023 మే 10న శాసనసభ ఎన్నికలు జరిగాయి. 2023 మే 13న ఫలితాలు వెల్లడించారు. ఆ తరువాత సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా నెగ్గారు. అయితే ఈ పదవికి గట్టి పోటీదారుగా నిలిచిన కర్ణాటక కాంగ్రెస్ ప్రెసిడెంట్ డీకే శివకుమార్ ని ఉప ముఖ్యమంత్రిగా చేశారు. రెండేళ్ళ తరువాత ఆయనకు సీఎం సీటు ఇస్తారని ఆనాడు ఒప్పందం జరిగిందని ప్రచారంలోకి వచ్చింది. ఆ గడువు చూస్తే ఇపుడు దగ్గరకు వచ్చేసింది. దాంతో కర్ణాటక సీఎం గా ఉన్న సిద్ధరామయ్య పదవికి గండం ఉందని అంటున్నారు. మరో వైపు చూస్తే సిద్ధరామయ్య మంత్రులతో ఎమ్మెల్యేలతో మాట్లాడుతూండడం భేటీలు వేయడంతో కర్ణాటక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఇంకో వైపు సీఎం పదవి విషయంలో డీకే శివకుమార్ ఏమీ తొందర పడటం లేదని ఆయన వర్గీయులు అనుచరులు చెబుతున్నారు. ఆయనకు పదవి న్యాయంగా రావాలసిన టైంలో వస్తుందని అంటున్నారు. సిద్ధరామయ్య పాలన చూస్తే అనుకున్నంతగా లేదని అంటున్నారు. కర్ణాటక లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సీట్లు దక్కుంచుకుంది. బలపడింది. ఇంకో వైపు ముడా కుంభ కోణం విషయంలో సీఎం సిద్ధరామయ్య ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రమేయం ఉన్న ముడా కుంభకోణం కేసులో లోకాయుక్త విచారణపై స్టే ఎత్తివేసిన కర్ణాటక హైకోర్టు బుధవారం విచారణను కొనసాగించాలని ఆదేశించింది. జనవరి 27లోగా లోకాయుక్త నుంచి హైకోర్టు నివేదిక కోరింది. దాంతో పాటుగా ఇప్పటి వరకు సేకరించిన అన్ని పత్రాలను రేపటిలోగా సమర్పించాలని లోకాయుక్తను కోరింది. దీంతో ఈ కేసులో చాలా సీరియస్ గానే అంతా సాగుతోంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో కూడా సిద్ధరామయ్య సీఎం సీటు మీద అనుమానాలు ముసురుకుంటున్నాయని అంటున్నారు. మరో వైపు మూడేళ్ళ కాలపరిమితితో డీకే శివ కుమార్ కి కర్ణాటక బాధ్యతలు అప్పగిస్తే ఆయన మళ్లీ పార్టీని ఒక గాటిన పెడతారు అని కాంగ్రెస్ అధినాయకత్వం ఆశిస్తోందని కూడా చర్చ సాగుతోంది. ఇవన్నీ చూస్తూంటే సిద్ధరామయ్య మార్చి తరువాత తప్పుకుంటారని అంటున్నారు. మార్చి నెలలో బడ్జెట్ సెషన్ ఉంటుంది. అప్పటివరకూ ఆయన సీఎం గా ఉంటారని ఆ తరువాత డీకే ఆ సీటులోకి వస్తారని అంటున్నారు. మరో వైపు చూస్తే సీఎం సీటు విషయంలో మార్పుల గురించి ఎవరూ బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దు అని కాంగ్రెస్ అధినాయకత్వం ఆదేశించినట్లుగా తెలుస్తోంది.

## లీడర్ మరమ్మత్తుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం



శామీర్ పేట, (గరుడ వార్త) : పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండబోతుందని శామీర్ పేట విద్యుత్ ఏ ఈ రాఘవేంద్రరావు ఓ ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. శుక్రవారం శామీర్ పేట విద్యుత్ సబ్స్టేషన్లో లియోనియా ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉప్పరపల్లి, కంట్రీ హెూమ్స్, ఓ ఆర్ ఆర్ గార్డెన్స్, వాసవి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.


## ప్రయాణికులకు రోడ్డుపై ఇబ్బందిగా ఉన్న కటౌట్స్ ను తొలగించిన ట్రాఫిక్ ఏసిపి





శామీర్ పేట, ( గరుడ వార్త) : ప్రధాన కూడలిలో ప్రయాణికులకు ఇబ్బంది కరంగా ఉన్న కటౌట్స్ ను మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్రెడ్డి తొలగించారు. గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తా వద్ద ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఏర్పాటు చేసిన కటౌట్స్ ను ఏసిపి వెంకట్ రెడ్డి తన పోలీస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హనుమాన్ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఆర్టీసీ డి ఎం హకీంపేట



శామీర్ పేట, ( గరుడ వార్త ) : హకీంపేట ఆర్టీసి డిపో పరిధిలో డయల్ యువర్ డి ఎం కార్యక్రమా న్ని నిర్వహించబోతున్నట్లుగా సదరు డిపో మేనేజర్ భవభూతి గురువారం తెలిపారు. డిపో పరిధిలోని శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలా లతో పాటు అల్వాల్, కంటోన్మెంట్, బొల్లారం, జవహర్ నగర్, బాలాజీ నగర్, సి ఆర్ పి ఎఫ్ ప్రజలు ఆర్టీసీ బస్ సర్వీస్ సేవలకు సంబంధించి తమ తమ సమస్యలతో పాటు సూచనలు, సలహాలు తెలిపేందుకు 17 న నేడు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు 99592 26144 ఫోన్ నంబర్ లో డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులు మీ అమూల్యమైన సూచనలు, సలహాలను అందజేయాలని డి ఎం విజ్ఞప్తి చేశారు.

## తనిఖీల ఊసులేదు.. నిఘా జాడలేదు




హైదరాబాద్ : రాష్ట్రానికే రాబడిలో వెనుదన్నుగా ఉన్న రాజధాని హైదరాబాద్ నగరంలో యథేచ్ఛగా సాగుతున్న జీరో వ్యాపారంతో ప్రతినెలా రూ.కోట్లలో పన్ను ఎగవేతకు గురవుతోంది. జీఎస్టీ చెల్లించకుండానే ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వస్తువులను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖలో 15 డివిజన్లు ఉండగా వీటిలో 8 నగరంలోనే ఉన్నాయి. కీలకమైన రాబడి అంతా ఈ డివిజన్లలో ఉంది. నగరంలోని పలు చోట్ల జీరో వ్యాపారం భారీగా సాగుతోందని వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఢిల్లీ, మహారాష్ట్ర నుంచి నగరానికి పన్నులు చెల్లించకుండానే భారీగా వస్తువులను తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు జీఎస్టీ పరిధిలోకి వేర్వేరు రకాల వస్తువులు ఉన్నాయి. రాత్రి 11 గంటలనుంచి తెల్లవారు జామున 3 గంటల్లోపు వాహనాల్లో నగరానికి వస్తున్న సరకును అక్రమంగా గోదాముల్లో నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు. తనిఖీల జోలికి వెళ్లని జీఎస్టీ అధికారులు : పన్నులు చెల్లించకుండా నగరానికి చేరుతున్న వాహనాలను గుర్తించడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. వాహనాల తనిఖీలో జీరో వ్యాపారంతో సరకుల విక్రయాలపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అబిడ్స్, చార్మినార్, సికింద్రాబాద్, పంజాగుట్ట, బేగంపేట డివిజన్ల పరిధిలో పలు ప్రాంతాల్లోని మార్కెట్లలో జీరో వ్యాపారం సాగుతున్నట్లు గుర్తించారు. కొందరు వ్యాపారులు ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులు సహా వివిధ రకాల ఉత్పత్తులను తెప్పిస్తున్నారు. భారీ పరిమాణంలో నిల్వలు ఉంటున్నా గుర్తించే పరిస్థితి లేదు.

**నగరంలో భారీగా స్టీలు జీరో వ్యాపారం**

నిర్మాణానికి ఉపయోగించే స్టీలు విక్రయాల్లో భారీగా జీరో వ్యాపారం సాగుతున్నట్లు తెలుస్తోంది. నగర శివార్లతో పాటు నగరంలో పెద్ద స్టీలు వ్యాపారులు భారీ పరిమాణంలో ఈ విక్రయాలు చేస్తున్నట్లు వాణిజ్యపన్నుల అధికారులు పేర్కొంటున్నారు. రూ.కోట్ల పన్ను ఎగవేత జరుగుతోందని వాణిజ్య పన్నుల శాఖ అధికారి ఒకరు తెలిపారు. నిఘాలోపమే కారణమన్నారు. ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగం ఉన్నా నిఘా లోపంతో పాటు తనిఖీల జోలికి వెళ్లక పోవడంతో పెద్దమొత్తంలో ఆదాయం కోల్పోతోంద న్నారు. బడా వ్యాపారులు ఉండడంతో అధికారులు ఆసక్తి చూపడం లేదన్నారు.

## అద్దంలా దారులు.. తీరనున్న అవస్థలు



కొడంగల్ : నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లకు మంచి రోజులు వచ్చాయి. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తరువాత రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలోని మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చడానికి, సింగిల్ రోడ్లుగా ఉన్న వాటిని రెండు వరుసలుగా మార్చడానికి రూ.380.52 కోట్లు మంజూరు చేశారు. వీటిలో కొన్నింటికి టెండర్లు ఖరారు పూర్తవడంతో పనులు చురుకుగా సాగుతున్నాయి. ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రయాణ కష్టాలు తీరతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.130.52 కోట్లు:** మూడు మండలాల పరిధిలోని 70.32 కిలో మీటర్ల మట్టి రోడ్లను బీటీగా మార్చడానికి రూ.130.52 కోట్లు మంజూరయ్యాయి. కొడంగల్ మండలంలో ఆరు రోడ్లకు రూ.45.29 కోట్లు, బొంరాస్‌పేటలో 8 రోడ్లకు రూ.52 కోట్లు, దౌల్తాబాద్‌లో నాలుగింటికి రూ.32 కోట్లు మంజూరయ్యాయి. ఆర్ అండ్ బీ పరిధిలోని 11 రోడ్లను రెండు వరుసలుగా మార్చడానికి, రెండు వంతెనల నిర్మాణానికి రూ.250 కోట్లు కేటాయించారు. నాలుగు దశాబ్దాలుగా పక్కా రోడ్డు కోసం ఎదురు చూస్తున్న బొంరాస్‌పేట మండలం మహంతీపూర్ గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి రూ.23 కోట్లు మంజూరయ్యాయి. కాకరవాణి వాగుపై వంతెన నిర్మించి ఈ రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఇదే మండలంలోని కొత్తూరు నుంచి దేవనూరు శివారు వరకు మట్టి రోడ్డును బీటీతో రెండు వరుసలుగా మార్చడానికి రూ.11 కోట్లు మంజూరయ్యాయి. వర్షాకాలం వస్తే మోకాళ్లలోతు గుంతలు పడ్డ ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలు బెంబేలెత్తేవారు. ఇది పూర్తయితే తాండూరుకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది.


దౌల్తాబాద్ మండలం తిమ్మారెడ్డిపల్లి నుంచి నాగసార్ మీదుగా తండాకు వంతెన, బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. పనులు జరుగుతున్నాయి.

**రవాణా సౌకర్యం మెరుగవుతుంది-కాశప్ప, లింగన్‌పల్లి**

జాతీయ రహదారి నుంచి లింగన్‌పల్లి మీదుగా దుద్యాల వరకు సింగిల్ రోడ్డును డబుల్‌గా మారుస్తున్నారు. దీనివల్ల వాహనాల రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. మా కల నెరవేరుతోంది- రంగంపల్లి అమృతమ్మ, మహంతీపూర్‌డాంబరు రోడ్డు కోసం చాలా ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం. వానొస్తే వాగు ప్రవహించి ఎక్కడికీ వెళ్లలేక ఊర్లోనే ఉండేవాళ్లం. ఇప్పుడు బీటీ రోడ్డు కోసం నిధులు మంజూరు చేయడంతో మా కల నెరవేరు తోంది.

## కంచెలు తెంచి.. హద్దులు చెరిపి

హైదరాబాద్ : ప్రభుత్వ భూములకు సరిహద్దులు.. కంచెలు.. జియోట్యాగింగ్‌లు లేకపోవడంతో కొందరు అక్రమార్కులు వాటిని చెరిపేసి ప్రైవేటు పట్టాభూముల ఖాతాల్లోకి మార్చుకుంటున్నారు. ఈ దందా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువగా సాగుతోంది. ధరణి పోర్టల్‌లోని లోపాలతో కొందరు రియల్ సంస్థల ప్రతినిధులు, వ్యక్తులు ఇప్పటికే రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు చెరపట్టారు. ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేస్తామని అధికారులు ప్రకటించినా...ఇప్పటి వరకూ ఎక్కడా సర్వే చేయలేదు.



ఆక్రమణ ఇక్కడే.. : రంగారెడ్డి జిల్లాలో సుమారు 500 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 300 ఎకరాలను ఆక్రమించుకున్నారని విశ్వసనీయంగా తెలుస్తోంది.

**పేరుకే డిజిటల్ సర్వేలు**

పహాణీలు, రెవెన్యూ రికార్డులు, ధరణి పోర్టల్‌లో ప్రభుత్వ భూముల వివరాలున్నా... వీటిల్లో చాలావరకూ నవీకరణ చేయలేదు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో కొన్నింటిని హెచ్‌ఎండీఏకు, ఐటీ, పరిశ్రమలశాఖలకు కేటాయించారు. వీటితో పాటు కొన్ని ధార్మిక సంస్థలు, కుల సంఘాల కార్యకలాపాలకు ప్రభుత్వ భూములను అప్పటి ప్రభుత్వం ఇచ్చేసింది. మిగిలిన ప్రభుత్వ భూములను డిజిటల్ సర్వే ద్వారా గుర్తిస్తామని, జియోట్యాగింగ్ చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. డిజిటల్ సర్వేనే కాదు..అసలు సర్వేచేయడానికి సర్వేయర్లు రెండు జిల్లాల్లోనూ లేరు.

**రికార్డులు సరిగా లేక..**

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని చాలామందికి తమ భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొందరు అక్రమార్కులు రెవెన్యూ విభాగంలోని కిందిస్థాయి సిబ్బందితో కలిసి తప్పుడు రికార్డులు సృష్టించి కోర్టుకెళ్తున్నారు. ఇటీవలే గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. అయినా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూ రికార్డులను సరి చూడటం లేదు.

## ఆపదలో అతివలకు ఆర్థిక వరం

తాండూరు : బషీరాబాద్ మండలానికి చెందిన ఓ మహిళ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అయితే ఆమె మండల కేంద్రంలోని బ్యాంకులో రూ.లక్షకుపైగా రుణం తీసుకుంది. ఇంకా కొంత చెల్లించాల్సి ఉండగా...తాజాగా రుణ బీమా పథకం వర్తింపుతో మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే మాఫీ చేస్తోంది. మర్పల్లి మండలానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు కొన్ని నెలల క్రితం మరణించింది. మహిళా సంఘం ఆధ్వర్యంలో రూ.80వేల అప్పు తీసుకుంది. సగం చెల్లించగా.. మిగతా మొత్తాన్ని కట్టాల్సిన పని లేకుండా పోయింది. ఎందుకంటే ఆమెకు రుణ బీమా పథకం వర్తిస్తోంది. అతివల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తీసుకున్న రుణానికి బీమా సౌకర్యాన్ని కొత్తగా అమలు చేయడంతో



సభ్యురాలి కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. రుణం తీసుకున్న సభ్యురాలు సాధారణ మరణం లేదా ప్రమాదంలో మరణిస్తే పక్షం రోజుల్లోగా అధికారులు బ్యాంకులకు ఆ మొత్తం చెల్లించే విధంగా ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

**జిల్లాలో 53 మంది..**జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మహిళా సంఘాల సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత, సంఘ రుణాలతో పాటు వ్యాపార పురోగతికి రుణాలను అందిస్తున్నారు. 2024 మార్చి 14వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సహజ, ప్రమాద మరణాలు కలిపి మొత్తం 53 మంది ఉన్నారు. ఇవి సమర్పించాల్సి ఉంటుంది..: మరణించిన సభ్యురాలి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, సంఘంలో సభ్యురాలేనని వీఓ ధ్రువపత్రం, రుణం తీసుకున్న బ్యాంకు ఖాతా, మరణించిన నాటికి ఎంత రుణం ఉందనే బ్యాంకు వివరాలు, తదితరాలు. మహిళా సంఘం అధ్యక్షుల నుంచి వీఓ, సీసీ, ఏపీఓ పూర్తి వివరాల దస్త్రాలను సమర్పిస్తే రుణ బీమా నగదు బ్యాంకు అప్పు ఖాతాకు, ప్రమాద బీమా నగదు సభ్యురాలు కుటుంబ సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డీపీఎం నర్సింహులు'కు వివరించారు.

## ఎంఎన్‌జే వైద్యశాలకు జవసత్వాలు

హైదరాబాద్: ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి జవసత్వాలు రానున్నాయి. కొత్తగా 47 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ పూర్తికానుంది. కొత్త సంవత్సరం నుంచి వీరంతా విధుల్లో చేరనున్నారు. దీంతో క్యాన్సర్ రోగులకు మరింత నాణ్యమైన చికిత్సలు అందించేందుకు ఆస్కారం కలగనుంది. తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల నుంచి ఎంఎన్‌జేకు నిత్యం క్యాన్సర్ రోగుల తాకిడి ఉంటోంది. ఇక్కడ అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలు ఉచితంగా అందిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమైన రోబోట్ చికిత్సలను కూడా ఎంఎన్‌జేలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం 150 వరకు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. మరో 50 పీజీలు, కాంట్రాక్టు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఏటా రోగుల సంఖ్య పెరుగుతోంది. కొత్తగా రానున్న వైద్యులతో ఇబ్బందులు తీరనున్నాయి.

# కాలువకు గండి.. ఊరిలోకి వరద

మానకొండూర్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి వద్ద ఆదివారం ఉదయం ఎస్సారెస్పీ డి-4 కాలువకు గండి పడింది. ఆ నీరంతా కాలువ పక్కనే ఉన్న ఇళ్లలోకి చేరడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తోటపల్లి రిజర్వాయర్ లింక్ కెనాల్ నుంచి సైదాపూర్, తిమ్మాపూర్, చిగురుమామిడి మండలాలకు సాగు నీరు సరఫరా అవుతోంది. ఇందులో భాగంగా చిగురుమామిడి మండలం పీచుపల్లి వద్ద ఉన్న రెగ్యులేటర్ నుంచి సైదాపూర్, మానకొండూర్ మండలం చెంజర్లకు సాగునీరు అందిస్తున్నారు. 150 క్యూసెక్కుల ప్రవాహంతో నీరు వెళ్లడంతో సైదాపూర్ వైపు నీటి అవసరాలు తీరడంతో గుర్తు తెలియని వ్యక్తులు గేట్‌వాల్వ్ మూసేశారు. దీంతో చెంజర్ల వైపునకు వరద 300 క్యూసెక్కులకు పెరిగిపోవడంతో మన్నెంపల్లి వద్ద కాలువకు గండి పడింది. దీంతో ఒక్కసారిగా వరద నీరు మన్నెంపల్లి గ్రామంలోకి రావడంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. పండగపూట చూస్తుండగానే ఇళ్లలోకి నీరు చేరి విలువైన



సామగ్రి తడిసిపోయిందని స్థానికులు వాపోయారు. ఇప్పుడు గండి పడిన చోటే గతంలో మూడు పర్యాయాలు గండిపడిందని.. పకడ్బందీ మరమ్మతు చర్యలు చేపట్టకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతోందని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే పరిశీలన**గండిపడ్డ ప్రదేశాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షు డు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఇళ్లకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లామని చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

**మరమ్మతులు చేపట్టిన అధికారులు**

గండిపడ్డ ప్రదేశంలో అధికారులు ఇసుక సంచులతో మరమ్మతు చేపట్టారు. రాత్రి వరకు పనులు పూర్తి చేస్తామని డీఈ సదయ్య తెలిపారు. ఈఎన్‌సీ శంకర్ పనులు పర్యవేక్షించారు.


సహాయక చర్యలు చేపట్టండి

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

కాలువ గండితో మన్నెంపల్లిలోకి నీరు చేరిన ఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గండిని పూడ్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# దుకాణాలే లక్ష్యంగా చోరీలు

జగిత్యాల : ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో దొంగల ముఠా పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. కేవలం దుకాణాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠా ప్రతిరోజు రాత్రి వరుసగా రెండు, మూడు పట్టణాల్లో చోరీలకు పాల్పడుతోంది. అంతర్రాష్ట్ర దొంగల ముఠాగా భావిస్తున్నప్పటికీ పలు చోరీలకు పాల్పడ్డ వారు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారిలో ఒకరిద్దరిని నిజామాబాద్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ మరో ముఠా చోరీలకు పాల్పడుతోంది. 10 రోజులుగా నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, కమ్మర్‌పల్లి, జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి, కోరుట్ల, ధరూర్, వరంగల్, మహబూబాబాద్. సిద్దిపేట జిల్లాలో రహదారులపై ఉన్న పలు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డవారు ఒకే ముఠాగా తెలుస్తోంది. నలుగురు సభ్యులుగల ముఠా కారులో తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.



ఈనెల 4న మెట్‌పల్లిలో 2, అమ్మక్కపేటలో 1, కోరుట్లలో 3 దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. మెట్‌పల్లి సీఐ ఎ.నిరంజన్‌రెడ్డి పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా నిర్మల్ జిల్లా టోల్‌గేట్ మీదుగా నిజామాబాద్ జిల్లా మీదుగా జగిత్యాలకు కారులో ముఠా వచ్చినట్లు తేలింది. అయితే రెండ్రోజుల కిందట ముఠా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఓ దుకాణంలో చోరీకి పాల్పడుతుండగా సమీపంలో ఉన్న బ్లూకోర్ట్ పోలీసులు చేరుకోగా వారిని చూసి పారిపోతుండగా ఒకరు దొరికినట్లు తెలిసింది. దీంతో చోరీకి పాల్పడ్డవారు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారిగా తేలింది. శుక్రవారం రాత్రి ధర్మపురి మండలం నేరెళ్లలో తాళం వేసి ఉన్న 4 ఇళ్లల్లో చోరీ జరగగా శనివారం రాత్రి జగిత్యాల జిల్లా కేంద్రంలో 4 దుకాణాలు, కొడిమ్యాల మండలం పూడూరులో 1 దుకాణం, కరీంనగర్ జిల్లా గంగాధర ఎక్స్‌రోడ్డు ఒక దుకాణంలో చోరీ జరిగింది.

ఒకేరోజు రాత్రి ఒకే తరహాలో 3 ప్రాంతాల్లో చోరీలు జరగడంతో ఈ ముఠా సైతం వాహనంలోనే తిరుగుతున్నట్లు భావిస్తున్నారు. వారంకిందట చోరీలకు పాల్పడ్డవారు అంతర్రాష్ట్ర ముఠాగా భావించినప్పటికీ ఆర్మూర్‌లో ఒకరు పట్టుబడడంతో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారిగా తేలింది. శుక్ర, శనివారాల్లో రాత్రి చోరీలు జరిగిన తీరును బట్టి చేసింది అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన వారుగా పోలీసులు భావిస్తున్నారు. అన్ని రహదారుల్లో దుకాణాలు, కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వాహనాల నంబర్లను సేకరిస్తున్నారు. జిల్లాలో రెండ్రోజుల వ్యవధిలో మూడు ప్రాంతాల్లో చోరీలు జరిగిన నేపథ్యంలో ముఠాను పట్టుకునేందుకు పోలీసు అధికారులు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

# ఆమోదం లేకుండానే టెండర్లా!




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హెచ్-సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టులను జీహెచ్‌ఎంసీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. ఇంజినీర్లు ఇప్పటి వరకు డీపీఆర్‌లను ఆమోదించలేదు. దాదాపు రూ.6వేల కోట్లతో రూపుదిద్దుకున్న పనులపై అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తుండటంతో.. ప్రాజెక్టులు పూర్తవుతాయా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**నిలిచిన డీపీఆర్‌లు..**

కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లను రెండు దశల్లో రూ.1090కోట్లతో అభివృద్ధి చేసేందుకు అక్టోబరు, 2024లో జీహెచ్‌ఎంసీ టెండరు నోటీసు ఇచ్చింది. మూడు నెలలవుతున్నా టెండరు నోటిఫికేషన్ మాత్రం విడుదల కాలేదు. డీపీఆర్ లేకుండా టెండరు నోటీసు విడుదలపై అధికారుల నుంచి సమాధానం లేదు.

రూ.459కోట్లతో గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ కూడలిని అభివృద్ధి చేయాలన్నది ప్రణాళిక. డీఎల్‌ఎఫ్ రోడ్డు నుంచి ఐఎస్‌బీ రోడ్డు, ఐఎస్‌బీ రోడ్డు నుంచి గచ్చిబౌలి కూడలి వైపు, డీఎల్‌ఎఫ్ రోడ్డు నుంచి గచ్చిబౌలి స్టేడియం దిశలో పైవంతెనలు, గచ్చిబౌలి కూడలి-గచ్చిబౌలి స్టేడియం మధ్య కూడలిలో ఆరు లైన్ల అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సైతం అటకెక్కింది. రూ.158కోట్లతో విప్రో చౌరస్తాపై ఐఎస్‌బీ రోడ్డు-ఓఆర్‌ఆర్ మధ్య రాకపోకల కోసం నాలుగు లైన్ల పైవంతెన, ఐసీఐసీఐ చౌరస్తాలో విప్రో జంక్షన్-ఓఆర్‌ఆర్ మధ్య నాలుగు లైన్ల అండర్‌పాస్ నిర్మించాలన్న ప్రణాళిక నిలిచిపోయింది.

రూ.220కోట్లతో ఖాజాగూడ చౌరస్తాలో టోలిచౌకి నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాల కోసం అండర్‌పాస్, నానక్‌రామ్‌గూడ నుంచి టోలిచౌకి వైపు వెళ్లే వారికి పైవంతెన నిర్మాణ పనుల ప్రాజెక్టులోనూ జాప్యం చోటు చేసుకుంది.

హెచ్-సిటీపైనే ఆశలు.. కొత్త ప్రభుత్వం వచ్చాక ఎస్సార్డీపీ కింద చేపట్టాల్సిన కొత్త పనులు నిలిచిపోయాయి. హెచ్-సిటీ తెరపైకి వచ్చింది. అందులో భాగంగా డిసెంబరు 3న 23 ప్రాంతాల్లో రూ.5,942కోట్ల విలువైన పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కేబీఆర్ పార్కు కూడళ్ల అభివృద్ధి పనులు కూడా హెచ్-సిటీలో భాగమే.

# పరిష్కారం దిశగా ధరణి దరఖాస్తులు




కరీంనగర్ : మండల రెవెన్యూ, జిల్లా కార్యాలయాలు, ప్రజావాణి చుట్టూ తిరుగుతున్న అన్నదాతల భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రైతులకు సులభతరమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో నూతన ఆర్ఓఆర్ చట్టానికి రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లు చట్టంగా మారగానే ధరణి పోర్టల్ స్థానంలో 'భూభారతి'ని ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధరణి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ధరణి పోర్టల్‌లోని పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యల తీరుపై కథనం.

**సమస్యలతో సతమతం**

భూముల రిజిస్ట్రేషన్‌కు స్లాట్‌బుక్ చేసుకొని రుసుం చెల్లించే సమయంతోపాటు దరఖాస్తులకు సంబంధించిన దస్త్రాల కంప్యూటరీకరణ సమయంలో ధరణిలో ఆప్షన్ లేక అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్త చట్టం రూపకల్పన నేపథ్యంలో రైతులు పెండింగ్ సమస్యల పరిష్కారంపై నమ్మకంతో భూభారతి పోర్టల్ వచ్చాకే పరిష్కరించుకుందామని అర్జీలు సైతం సమర్పించటం లేదు. గతంలో రోజుకు 150 నుంచి 250 దరఖాస్తులు రాగా ప్రస్తుతం రోజుకు పదుల సంఖ్యలో మాత్రమే వస్తున్నాయి.

**పెండింగ్ అర్జీలపై సమీక్ష**

ధరణి పోర్టల్‌లో స్థానిక మండల తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు లాగిన్ పాస్‌వర్డు కల్పించి సమస్యలు పరిష్కరించే బాధ్యతలు అప్పగించారు. దరఖాస్తులను పూర్తి మొత్తంలో పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి రెవెన్యూ యంత్రాంగానికి గడువు విధించటంతో పెండింగ్ దరఖాస్తుల బూజు దులుపుతున్నారు. వారం, పది రోజుల్లోపు సమస్యలన్నీ పరిష్కరించాలనే లక్ష్యంతో యంత్రాంగం పని చేస్తోంది. పెండింగ్‌లోని సమస్యలను పరిష్కరిస్తున్నారు. డిజిటల్ పట్టాదారు పాసు పుస్తకాల్లోని తప్పులను సవరిస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి సమస్యలను తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కరిస్తున్నారు.

**807 దరఖాస్తులే మిగిలి ఉన్నాయి**

వారం రోజుల్లో అర్జీలన్నీటిని క్లియర్ చేస్తాం. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పేర్కొన్నారు. వేలల్లో ఉన్న పెండింగ్ అర్జీలు ప్రస్తుతం 807 కు తీసుకొచ్చామన్నారు. మహేశ్వర్, ఆర్డీవో, కరీంనగర్

# జలం.. సంరక్షిస్తే అమృతం

పెద్దపల్లి : సకల జీవరాశులకు ప్రాణాధారామైన నీరు రానురానూ విషతుల్యమవుతోందని కేంద్ర భూగర్భ జల మండలి ఇటీవల తన నివేదికలో వెల్లడించింది. భూగర్భ జలాల నాణ్యత వార్షిక నివేదిక-2024లో ఉమ్మడి జిల్లా నీటిలో సూక్ష్మజీవులు, రసాయన అవశేషాలు అధిక మోతాదులో ఉన్నాయని స్పష్టం చేసింది. నైట్రేట్, ఫ్లోరైడ్, క్లోరైడ్ మోతాదులు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది.

ఉమ్మడి జిల్లాలో గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ, బోర్లు, బావుల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. భూగర్భ జల శాఖ అధికారులు గ్రామాల వారీగా బోర్లు, బావుల నుంచి సేకరించిన నీటి నమూనాల్లో నైట్రేట్, ఫ్లోరైడ్, క్లోరైడ్ అవశేషాలు అధికంగా ఉన్నాయి. పంటల్లో అధిక దిగుబడుల కోసం రైతులు విచ్చలవిడిగా యూరియా, ఇతర రసాయన ఎరువులు వినియోగిస్తుండటంతో నైట్రేట్ అవశేషాలు పెరుగుతున్నట్లు నివేదికలో తేలింది.

**నైట్రేట్**

ఆ రెండు లవణాలు అధికం : లీటరు నీటిలో 45 మిల్లీగ్రాములు మించితే సాగు, తాగు అవసరాలకు పనికి రాదు. ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల జలాల్లో నైట్రేట్ అధికంగా ఉంది. జగిత్యాల జిల్లాలో బుగ్గారంలో 139 మి.గ్రా., రాజారం 165, వెనుగుమట్ల 150, తిమ్మాపూర్ 142, గుళ్లపేట 109, కంట్లకుంట 94, ల్యాగలమర్రి 70, రాయికల్ 130, అర్పపల్లి 103, కప్పరావుపేట 100.. కరీంనగర్ జిల్లాలో కొత్తపల్లి 124, దుర్శేడు 104, కందులపల్లి 91, జమ్మికుంట 79, కోరపల్లి 69, శ్యామ్‌పేట 61, వెలిచాల 103.. పెద్దపల్లి జిల్లాలో అందుగులపల్లి 93, పెద్దపల్లి 133, తక్కళ్లపల్లి 140, బేగంపేట 184, నాగారం 106, వెక్లాస్‌పూర్ 168, బిట్టుపల్లి 152, మచ్చుపేట 119, వెంకటాపూర్ 161, ఓదెల 114.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధర్మపురం 55, కోరెం 58, రేపాక 79, జోగాపూర్ 79, తిమ్మాపూర్ 54, వల్లెంపట్లలో 167 మి.గ్రా.ల నైట్రేట్ ఉంది.

**ఫ్లోరైడ్**

లీటరు నీటిలో 1.50 మిల్లీగ్రాములలోపు ఉండాలి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా జగిత్యాల జిల్లాలో మల్లన్నపేట 2.05, అయోధ్య 2.31, చెప్యాల 2.42, ఇటిక్యాల 2,21, రాంపూర్ 1.82, సర్వాపూర్ 3.58, కరీంనగర్ జిల్లాలో 2.54, జగ్గయ్యపల్లి 2.11, బేతిగల్ 2.57, పోతిరెడ్డిపేట 2.10, తోకలపల్లి 2.52, టేకుర్తి 2.5, నాగంపేట 2.59, గోపాల్‌రావుపేట 2.54, సైదాపూర్ 2.93, ర్యాలపల్లి 2.10, పెద్దపల్లి జిల్లాలో కాట్నపల్లి 1.85, రాఘువాపూర్ 5.63, ఓదెల 2.06,



అడవిసోమన్‌పల్లి 1.67, కాచాపూర్ 3.45, వెంకటాపూర్ 1.69, ఖమ్మంపల్లి 5.59, కల్వచెర్ల 2.36, రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాజన్నపేట 2.51, ధర్మారం 1.94, కందికట్కూర్ 3.80, గాలిపల్లి 4.15, అల్మాస్‌పూర్ 2.01, బూరుగుపల్లిలో 2.14 మి.గ్రా.ల ఫ్లోరైడ్ ఉంది.

**వాన నీటిని భూమిలోకి ఇంకించడమే మార్గం**

నీటిలో లవణాలు మోతాదుకు మించితే తాగు, సాగు అవసరాలకు వినియోగించినపుడు అనర్థాలకు దారి తీస్తాయి. నైట్రేట్ లవణాలతో గర్భిణులకు పుట్టబోయే పిల్లల్లో బ్లూ బేబీ సిండ్రోమ్(రక్తంలో తగినంత ఆక్సిజన్ లేకపోవడం) సమస్యకు దారి తీస్తుంది. అయిదేళ్లలోపు పిల్లల్లో కంటి చూపు పోతుంది. నేల చౌడుగా మారి పంట దిగుబడులు తగ్గుతాయి. ఫ్లోరైడ్ నీటితో చేతులు, కాళ్లు వంకర పోతుంటాయి. క్లోరైడ్ వల్ల నీటిలో కఠినత్వం పెరగడం ద్వారా జీర్ణకోశ సంబంధ వ్యాధులు వస్తాయి. బోర్లు, బావుల వద్ద ఇంకుడు గుంతలు, మానేరు, వాగుల ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా సమస్యను అరికట్టవచ్చు. చెరువుల్లో ఏటా పూడిక తొలగించాలి. వర్షపు నీరు భూమిలోకి చేరితే ఫ్లోరైడ్, నైట్రేట్ అవశేషాలు తగ్గుముఖం పడతాయి.

**ఎరువుల వినియోగం తగ్గిస్తేనే మేలు**

జిల్లాలో బావులు, బోర్ల నీటిలోనే నైట్రేట్ శాతం అధికంగా ఉంది. రైతులు దిగుబడులు పెరగాలన్న ఆతృతలో ఎరువులు అధికంగా వినియోగిస్తున్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల నేల నిస్సారమవుతుంది. భూగర్భ జలాల సంరక్షణకు ప్రజలు స్వచ్ఛందంగా కృషి చేయాలి. లావణ్య, పెద్దపల్లి జిల్లా భూగర్భ జల శాఖ అధికారి

# పస్తులతో ఫలితాలెలా?

సారంగాపూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఇంటర్మీడియట్ బోర్డు వార్షిక పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ప్రత్యేక తరగతులను ప్రారంభించగా మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రంలో ఉన్న కళాశాలలకు రావాలంటే బస్సులు లేకపోవడం.. ఉదయం వచ్చిన విద్యార్థులు సాయంత్రం వరకు ఉండాల్సి రావడంతో ఆకలితో అలమటించాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుకు నోచుకోవడం లేదు. విద్యార్థుల హాజరు శాతం పడిపోతుందని అధ్యాపకులు వాపోతున్నారు. విద్యార్థులు మధ్యాహ్నం కళాశాల నుంచి వెళ్లిపోతుండడంతో ఫలితాలపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా 90 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే కళాశాలల్లో సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఫిబ్రవరి 3 నుంచి ప్రయోగ పరీక్షలు, మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు మరో రెండు నెలలు ఎంతో కీలకం. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేయడం తోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన



అవసరముంది. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5089 విద్యార్థులు ఉండగా, ప్రథమ 2029, ద్వితీయ 1816 మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు తరగతులకు హాజరయ్యేందుకు అధ్యాపకులు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. ఒక్కో విద్యార్థి ఇంటికి రెండూమూడు మార్లు వెళ్లినా విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించకపోవడంతో అధ్యాపకులకు తలనొప్పిగా మారింది.

**దాతల సహకరంతో అమలు**

రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు సొంతంగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెంబట్లకు చెందిన మర్యాల రాజన్న అనే దాత సహకారంతో అల్పాహారం అమలు చేస్తున్నారు. దాతలు సహకరించకుంటే విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. కనీసం అల్పాహారం అందించేందుకు నిధులు మంజూరు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

**నిరుపేద విద్యార్థులే ఎక్కువ**

మాది కండ్లపల్లి గ్రామం. ఉదయం ఇంటి వద్ద తిని బస్సులో వస్తే ఇంటికి వెళ్లే సరికి రాత్రి అవుతుంది. పాఠశాలల మాదిరిగా కళాశాలల్లోనూ భోజనాన్ని అందించాలి. అంతేకాకుండా ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్నందున ప్రత్యేక భోజన వసతి కల్పించాలి. రమ్య, ద్వితీయ, కండ్లపల్లి

**ఏకాగ్రత కోల్పోతున్నాం** ఆకలితో ఉండడంతో చదువుపై దృష్టి సారించలేక ఏకాగ్రత కోల్పోతు న్నాం. మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. కనీసం అల్పాహారం అందించినట్లయితే సాయంత్రం వరకు చదువు కొనసాగించడంతోపాటు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. కార్తీక్, ప్రథమ, చర్లపల్లి

# పెరటి తోట.. ఆరోగ్యానికి బాట

ఖమ్మం : లబ్ధిదారుల మానసిక, శారీరక పరివర్తనే లక్ష్యంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆరోగ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోంది. తల్లీ పిల్లల ఆరోగ్య సంరక్షణ, పోషకాహార లోపంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే బాలామృతంతో పాటు కోడిగుడ్లు, తల్లులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తోంది. ఈ క్రమంలోనే తాజా కూరగాయలతో ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు సన్నద్ధమైంది. అంగన్‌వాడీ కేంద్రాలున్న ప్రాంగణాల్లో ఖాళీ ప్రదేశంలో గ్రీన్ గార్డెన్(పెరటితోట)లు ఏర్పాటు చేయాలని భావించింది. సొంత భవనాలున్న కేంద్రాల్లో తొలుత ఈ తరహా ప్రయోగాలు చేయాలని సిబ్బందిని ఆదేశించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తోటల పెంపకం పూర్తిస్థాయిలో చేపడితే లబ్ధిదారులకు పోషక విలువలతో కూడిన ఆహారం స్థానికంగానే లభించే అవకాశం ఉంది.

**అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా..**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3,900 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో సొంత భవనాలు, స్థలాలు అనువుగా ఉన్న ప్రదేశాల్లో పెరటి తోటల పెంపకం చేపట్టాలని నిర్ణయించారు. నీటి సదుపాయం లేని వాటికి నల్లా కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. సాగు పద్ధతులపై టీచర్లు,



ఆయాలకు తర్ఫీదు ఇచ్చారు. నేల స్వభావం, నీటి లభ్యత ఆధారంగా ఆకు కూరలు, కూరగాయల పంటలు పండించాలి. క్రిమిసంహారక మందులు వినియోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో మాత్రమే వాటిని పెంచాలి. సహజంగా అందుబాటులో ఉండే టమాటా, మునగ, సొర, బీర, బెండ, దొండ, చిక్కుడు, పాలకూర, గోంగూర, చుక్కకూర, కొత్తమీర, కరివేపాకు, మెంతికూర వంటి పలు రకాలు సాగు చేయాలి. ఆయా మొక్కల్లో ఒక్కో రకం కనీసం ఐదు వరకు పెంచాలి. భవిష్యత్తులో విత్తనాలనూ సరఫరా చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నాయి. **వనరులున్న చోట పెంచాలని సూచించాం**

పెరటి తోటల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. వనరులున్న అన్ని కేంద్రాల్లో వీటిని పెంచాలని సిబ్బందికి సూచించాం. కేంద్రాలను సందర్శిస్తూ పర్యవేక్షించాలని సీడీపీఓలను ఆదేశించాం. కె.రాంగోపాల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ

# తిర'కాసులు'

హైదరాబాద్: వ్యవసాయ భూములను ఇళ్లు, వ్యాపార అవసరాలకు మార్చుకోవాలా.. నిషేధిత జాబితాలోని ప్రైవేటు భూములకు పట్టా కావాలా.. అయితే డిజిటల్ సంతకానికి డబ్బులిస్తేనే దస్త్రం వేగంగా ముందుకువెళ్తుంది. లేదంటే అది ఎక్కడుందో కూడా తెలియదు. రంగారెడ్డి జిల్లాలో కొందరు రెవెన్యూ అధికారుల తీరిది. ఐదు నెలల క్రితం అవినీతి నిరోధకశాఖ అధికారులకు అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటంతో కొద్దిరోజుల పాటు ఆగిన లంచం డిమాండ్లు తర్వాత మళ్లీ పుంజుకున్నాయి. కందుకూరు, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్లలోని కొన్ని కార్యాలయాల్లో డిజిటల్ సంతకం విలువ భూముల రేట్ల ఆధారంగా మారుతుంటోంది. కాసులిస్తేనే దస్త్రాలు కదులుతున్నాయ్.

**తప్పులు చేసింది అధికారులే..**

రాష్ట్రవ్యాప్తంగా ఆరేళ్ల క్రితం వ్యవసాయ, ప్రభుత్వ భూముల రికార్డులను ధరణి పోర్టల్‌లో నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లాలో రికార్డుల్లో వివరాలు నమోదు చేసేప్పుడు తప్పులు చేశారు. వ్యవసాయ భూములను నిషేధిత జాబితాలోకి, ప్రైవేటు పట్టా భూములను ప్రభుత్వ భూముల్లోకి, ఒక సర్వే నంబర్ భూమిలో బై నంబర్లతో మరికొన్ని భూములను



కలిపేశారు. రైతుల భూములను చెరువుల సర్వే నంబర్లకు జతచేశారు. అసైన్డ్‌భూముల జాబితాల్లోనూ మార్పులు చేర్పులు చేశారు. ఇలాంటి తప్పులు ఎక్కువగా రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, రెవెన్యూ డివిజన్లలో జరిగాయి. దీంతో పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం భూములు విక్రయించేందుకు ప్రయత్నించగా.. తప్పులు బయటకు వచ్చాయి. వీటిని సవరించాలంటూ దరఖాస్తులు చేసుకున్నా చాలావరకు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి.

**సమస్యలు అలాగే ఉన్నాయ్...** దరఖాస్తుదారుల్లో చాలామంది హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వచ్చి తమ ఆవేదనను వెల్లడించగా.. ప్రభుత్వం స్పందించి గతేడాది జనవరిలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించింది. అప్పట్లోనే తప్పులు సవరించాలంటూ 17వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరిస్తుండగానే లోక్‌సభ ఎన్నికలు రావడంతో గతేడాది జులై నుంచి వీటిని పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు బాధితులకు చెప్పారు. ఐదునెలలు పూర్తయినా వందల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ సభ్యులు కొన్నింటిని ఆమోదించారు. కిందిస్థాయి అధికారులు వాటిని అమలు చేయాలంటే చేతులు తడపాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. డబ్బులు ఇవ్వనిదే మార్పులు, చేర్పులు చేయబోమంటూ స్పష్టంగా చెబుతున్నారు. ఉన్నతాధికారులను కలిసినప్పుడు చేస్తామంటూ చెప్పి వాటిని తొక్కిపెడుతున్నారు. పెండింగ్ దరఖాస్తులపై ఉన్నతాధికారులు స్పందించాలని బాధితులు అభ్యర్థిస్తున్నారు.

# దశాబ్ద కాలంగా అవే పనులు

వేములవాడ : క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీయడం, సరైన సాధన, పోటీలు నిర్వహించేందుకు ప్రారంభించిన మినీ స్టేడియం నిర్మాణం దశాబ్ద కాలంగా కొనసాగుతూనే ఉంది. నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సాధన చేయడానికి సరైన మైదానాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ వద్ద మినీ స్టేడియం నిర్మాణానికి 2014లో అయిదు ఎకరాల స్థలాన్ని కేటాయించి రూ.2.10 కోట్లను మంజూరు చేశారు. తరవాత మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో భాగంగా రూ.5 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రీడాకారులు సాధన చేయడానికి ట్రాక్స్, విశ్రాంతి, డ్రెస్సింగ్ గదులు, క్రీడాపరికరాలు భద్రపరచడానికి ప్రత్యేక గదులు, కార్యాలయం, ప్రహరీ, ఇండోర్ స్టేడియం ఇతర పనులు చేపట్టాలని నిర్ణయించారు. నేటికీ ఇండోర్ స్టేడియం పైకప్పు, లోపల ఫ్లోరింగ్, విశ్రాంతి, వసతి గదులకు సంబంధించిన పనులు, డోర్లు, కిటికీలు, సింథటిక్ రన్నింగ్ ట్రాక్, ఖోఖో, కబడ్డీ మైదానం వంటి పనులు పూర్తి కాలేదు.

**సకాలంలో బిల్లులు అందక...**

పనులు చేపట్టిన గుత్తేదారుకు ఇప్పటి వరకు సుమారు రూ.1.50 కోట్లు చెల్లించాల్సి ఉండటంతో పనులు నిలిపివేసినట్లు తెలిసింది. మిగిలిన పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.3.50 కోట్లు అవసరం ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. పనులు ప్రారంభించి దశాబ్ద కాలం దాటినప్పటికీ స్టేడియం అందుబాటులోకి రాలేదు. దీంతో వివిధ క్రీడల్లో ప్రతిభ చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు నిత్యం సాధన చేయడానికి పట్టణంలోని కళాశాల, పాఠశాల క్రీడా మైదానాలు, వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టిసారించి నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

**సాధనకు ఇబ్బందులు**

పట్టణంలో మినీ స్టేడియం లేకపోవడంతో క్రీడాకారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వివిధ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, పోలీసు, ఆర్మీ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న నిరుద్యో యువతకు సాధన చేయడానికి సరైన మైదానం లేదు. ఖాళీ స్థలాలను వెతుక్కొని సాధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేడియం నిర్మాణం పూర్తయితే క్రీడాకారులకు వసతులు అందుబాటులోకి రావడంతోపాటు సాధన చేయడానికి అనువుగా ఉంటుంది.గంగరాజు, పోలీసు పోటీ పరీక్షల అభ్యర్థి, వేములవాడ

**త్వరగా పూర్తి చేయించాలి**

వివిధ పోటీల్లో సత్తాచాటేందుకు క్రీడాకారులు సన్నద్ధం కావడానికి సరైన వసతులు కల్పించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలి. సాధన చేసేందుకు మైదానం, సదుపాయాలు లేకపోవడంతో క్రీడాకారులు ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని త్వరగా పూర్తి చేయించాలి.వెంకటేశ్, జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు, చెక్కపల్లి **ఉన్నతాధికారులకు దస్త్రం పంపించాం**

మినీ స్టేడియంలో చేపట్టిన పనులకు సంబంధించి గుత్తేదారుకు బిల్లులు చెల్లించడానికి దస్త్రాన్ని ఉన్నతాధికారులకు పంపించాం. బిల్లులు వచ్చిన వెంటనే పనులు చేస్తానని గుత్తేదారు తెలిపారు.

# రహదారుల మరమ్మతుకు మోక్షమెప్పుడో?



ముస్తాబాద్ : వర్షాకాలంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు. గుంతలు ఏర్పడ్డాయి. ఇరువైపులా కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది నుంచి సేవాలాల్‌తండాకు వెళ్లే రోడ్డు కంకర తేలింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పదేళ్ల క్రితం దాదాపు రెండున్నర కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు వేశారు. ఇది దెబ్బతిన్నది. పెచ్చులూడిపోయాయి. కంకర రాళ్లు తేలడంతో ప్రయాణం నకంగా మారిందని గీత కార్మికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెర్లుమద్ది ఎల్లమ్మ మలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న కాల్వ వర్షాకాలంలో వరద ప్రవాహానికి కోతకు గురైంది. మలుపు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు సేవాలాల్‌తండా–తెర్లుమద్ది రోడ్డు నుంచి బట్టువానితాళ్లు వెళ్లే రోడ్డులో దాదాపు కిలోమీటరు వరకు బీటీ పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. రాళ్లు తేలాయి. వాహనాలు దెబ్బతిని మరమ్మతులకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముస్తాబాద్ ప్రధాన రోడ్డు నుంచి తెర్లుమద్ది విద్యుత్ ఉప కేంద్రం మీదుగా సేవాలాల్‌తండా, రాగంవాడకు వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. భారాస ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ప్రకటించారు. పనులు మాత్రం ఇంత వరకు చేపట్టిన దాఖలాలు లేవు. అదేవిధంగా పల్లెమీదితండా పాఠశాల నుంచి ముస్తాబాద్–తెర్లుమద్ది ప్రధాన రోడ్డు, అక్కడి నుంచి రాగంవాడ వరకు మట్టి రోడ్డులో గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**అధ్వానంగా మారాయి**

కంకర రాళ్లు తేలి అధ్వానంగా తయారయ్యాయి. దెబ్బతిన్న రోడ్లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎల్లమ్మ దేవాలయం మలుపుతోపాటు పలుచోట్ల కోతకు గురై గుంతలు పడ్డాయి.దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు దెబ్బతిన్న రోడ్లను గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు చొరవ చూపాలి.

బైతి నవీన్, యువ నాయకుడు, తెర్లుమద్ది

**ప్రతిపాదనలు పంపించాం**

తెర్లుమద్ది–సేవాలాల్‌తండా, రాగంవాడలకు చెందిన రహదారుల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరై పైఅధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు చేపడతాం.

సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ డీఈ

# ఈ యంత్రాలు.. అపరిశుభ్రం చేస్తున్నాయ్



హైదరాబాద్: నగరంలోని రోడ్లు ఊడ్చే యంత్రాలతో కొత్త సమస్య ఉత్పన్నమవుతోంది. వ్యర్థాలను శుభ్రం చేసుకుంటూ వెళ్లాల్సిన వాహనాలు చెత్తను రోడ్లపైకి చిమ్ముతున్నాయి. దోమలకు పొగపెట్టే వాహనాల మాదిరి.. వెనుక వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లను దుమ్ములో ముంచుతున్నాయి. వాహనాల రాకపోకలతో విభాగిని వద్దకు చేరుకున్న కంకర రాళ్లు, కాగితాలు, మట్టి వంటి వ్యర్థాలను రోడ్డుపైకి విసురుతున్నాయి. రాత్రి పూట మాత్రమే పనిచేయాలన్న నిబంధన అమలు కాకపోవడంతో.. వాహనదారులకు పగటి పూట కూడా నరకం కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా.. కేవలం జీపీఎస్ ఆధారంగా అధికారులు ఆయా వాహనాలకు ఏటా రూ.43.28కోట్ల ప్రజాధనాన్ని చెల్లిస్తున్నారు. (%Hyderabad News)

నిధులు చెల్లిస్తున్నారిలా..

మొత్తం వాహనాలు..: 38

అవి శుభ్రం చేయాల్సిన రోడ్లు..: 701

వాటి పొడవు..: 1161కి.మీ

నెలకు వాహనాలకు చెల్లించే అద్దె..: రూ.3,62 కోట్లు

ఏడాదికి అద్దె: రూ.43.28 కోట్లు

**మొత్తం 38 వాహనాలు**

ఐదేళ్ల కిందట 891 కి.మీ రోడ్ల నిర్వహణను జీహెచ్‌ఎంసీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చింది. ఆయా రోడ్లను గుంతల్లేకుండా చూసుకునే బాధ్యతతోపాటు.. రహదారులను శుభ్రంగా ఉంచే బాధ్యతనూ అప్పగించింది. అందులో భాగంగా నగరంలోని ఆరు జోన్లకు కలిపి గుత్తేదారు సంస్థలు 38 ట్రక్ మౌంటెడ్ కాంపాక్ట్ హెవీ డ్యూటీ వాక్యూమ్ స్వీపర్లను ఐదేళ్ల కాలపరిమితికి అద్దె ప్రాతిపదికన రంగంలోకి దించాయి. గడువు పూర్తయ్యాక వాటి కాల పరిమితిని అధికారులు కొనసాగిస్తూ వెళ్తున్నారు.గంటల లెక్కన వీటికి అద్దె చెల్లిస్తున్నారు. రోజూ పది గంటలు పనిచేసి, 60 లేన్ కిలోమీటర్ల రోడ్లను ఊడ్చాలి. ఈ వాహనాలకు జీపీఎస్ పరికరాలు ఉంటాయి. రాత్రి 9 నుంచి ఉదయం 7గంటల మధ్యనే ఇవి పనిచేయాలి. ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకూడదన్నది ముఖ్యోద్దేశం. కొన్ని నెలలుగా ఎప్పుడు పడితే అప్పుడు వాహనాలు రోడ్లను ఊడ్చుతున్నాయి. అధికారుల తనిఖీ కొరవడింది.

# అక్రమ నిర్మాణాలు.. అంతస్తులు నిర్మిద్దాం.. అమ్మేద్దాం



హైదరాబాద్ : రాజధాని నగరంలో సరికొత్త ఐటీహబ్ కోకాపేట్.. చదరపు గజం రూ.లక్షలు పలుకుతోన్న కోకాపేట్ ప్రాంతంలో.. తక్కువ స్థలంలో రూ.కోట్లు సంపాదించేందుకు కొందరు వ్యక్తులు 60 గజాలు.. 120 గజాలు.. 200 గజాల్లో ఐదు, ఆరు, ఎనిమిది అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. కోకాపేట్, మంచిరేవుల ప్రాంతాల్లో కొద్దినెలల నుంచి బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణమవుతున్నాయి.

నార్సింగి మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండానే ఈ భవనాలు వెలుస్తున్నాయి. కొందరు మున్సిపల్ అధికారులు.. విద్యుత్తుశాఖ అధికారులు తెరవెనుక సహకరమందిస్తుండడంతో పనులు చకచకా పూర్తవుతున్నాయి. భవన యజమానులు మాత్రం రెండుపడక గదుల ఫ్లాట్లను విక్రయిస్తున్నారు. (

**అన్నింటికీ అనుకూలమంటూ ప్రచారం..**

కోకాపేట, మంచిరేవుల ప్రాంతాల్లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు గచ్చిబౌలి, మణికొండ, నార్సింగి, జంట జలాశయాలకు సమీపంలో ఉన్నాయి. వీటిని తాము తక్కువ ధరలకే ఫ్లాట్లు విక్రయిస్తున్నామని కొందరు వ్యక్తులు ప్రచారం చేసుకుంటున్నారు. కోకాపేటలో ఒకే ప్రాంతంలో 20 అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. ఒక్కో అపార్ట్‌మెంట్‌ను 250 గజాల్లో నిర్మిస్తున్నారు. పురపాలక నిబంధనల ప్రకారం మున్సిపాలిటీల్లో జీ౦3 అంతస్తుల భవనాలకు మాత్రమే అనుమతులుండగా జీ౦5, ఇంకా ఎక్కువ అంతస్తులను నిర్మిస్తున్నారు. కొన్నిచోట్ల అపార్ట్‌మెంట్లను బిల్డర్లు విక్రయించేశారు. కొన్ని నిర్మాణాల వెనుక ప్రజాప్రతినిధులున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సెట్‌బ్యాక్‌లు లేవు.. పార్కింగ్ అసలే లేదు..**

నార్సింగి మున్సిపాలిటీలో, ఐటీ కారిడార్‌కు సమీపంలో భవనాలు నిర్మిస్తే కంపెనీల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు అనువుగా ఉంటుందన్న భావనతో వీటిని భారీ స్థాయిలో కట్టేస్తున్నారు. ఈ భారీ బహుళ అంతస్తుల భవనాలకు ఎక్కడా సెట్‌బ్యాక్‌లు లేవు. వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ కూడా లేదు.. ఇళ్ల మధ్య ఇరవై అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. ఇరవై అడుగుల రోడ్డుకు రెండు వైపులా సెట్‌బ్యాక్‌లు లేకుండా, ఖాళీలు ఉంచకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు. భవన నిర్మాణం అక్రమమని తెలిసినా విద్యుత్తు, జలమండలి అధికారులు కనెక్షన్లు ఇచ్చారు. మున్సిపాలిటీ అధికారులు రహదారులు నిర్మించారు. మంచిరేవుల ప్రాంతంలో 60 గజాల్లో ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. ఇప్పటికే చాలా భవనాలను కూల్చేశామని, ఒకటి, రెండురోజుల్లో మిగిలిన వాటిని కూల్చేస్తామని తెలిపారు.

# ట్యాంకర్ల సరఫరా.. మరింత పక్కాగా

హైదరాబాద్: మహానగరంలో సరఫరా చేసే నీటి ట్యాంకర్ల అంశంలో మరింత పటిష్ఠ విధానం తీసుకొచ్చేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. ఆరేడు నెలల్లో రానున్న ట్యాంకర్ల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. అవసరమైన వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు నీటి దుర్వినియోగానికి అవకాశం లేకుండా చూడాలని జలమండలి భావిస్తోంది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి ప్రస్తుతం అమలవుతున్న ట్యాంకర్ల విధానంలోని లోటుపాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. కీలకమైన అంశాల్లో మార్పులు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని గుర్తించారు. ప్రధానంగా ట్యాంకర్ల బుకింగ్ విధానమే పక్కాగా ఉండేలా కొన్ని మార్పులపై దృష్టిసారించారు. ఆన్‌లైన్‌లో ట్యాంకర్ బుక్ చేసుకునే అవకాశంతో పాటుగా నేరుగా తీసుకునేందుకు ప్రస్తుతం జలమండలి వీలు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ట్యాంకర్ల బుకింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని యోచిస్తున్నారు.



కనీసం రూ.100 చెల్లించాలి.. కొంతమంది ట్యాంకర్లను బుక్ చేసుకుని తర్వాత తీసుకోవడం లేదు. దీంతో అవి పక్కదారి పట్టే అవకాశం ఉంది. దీన్ని గుర్తించి ట్యాంకర్ బుకింగ్ సమయంలోనే కనీసం రూ.100 చెల్లించాలని సూచించడం ద్వారా అవసరమున్న వారు మాత్రమే ట్యాంకర్ బుక్ చేసుకుంటారని అధికారులు భావిస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసుకున్నవారికి నిర్దేశించిన సమయంలో సరఫరా చేయడమే లక్ష్యంగా దృష్టిసారించారు. వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని మేనేజర్లకు, డీజీఎంలకు సూచించారు. గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా రాత్రి సమయంలో వీటికి ట్యాంకర్లు పంపనున్నారు. ప్రస్తుతం 700 ట్యాంకర్లు ఉండగా మరో వంద ట్యాంకర్లను అదనంగా వినియోగించాలని ఇప్పటికే జలమండలి నిర్ణయం తీసుకుంది.

# పెరగనున్న విత్తన వరి సాగు

హుజూరాబాద్ : ఉత్తర తెలంగాణలోనే విత్తనోత్పత్తికి అనుకూలమైన ఉమ్మడి జిల్లాలో.. ఈసారి వరి విత్తన సాగు గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. గత మూడు నాలుగేళ్లుగా కొంతమేర సాగు తగ్గినా.. లోకల్ సీడ్‌తోపాటు ఆడ–మగ విత్తన వరి సాగుకు ఆయా సంస్థలు పోటీ పడుతున్నాయి. పైగా గతేడాది కంటే ఎక్కువ ధర నిర్ణయించి ప్రోత్సహిస్తుండటంతో సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి మల్టీ నేషనల్ కంపెనీలు రైతులకు ఒప్పంద పత్రాలు ఇస్తున్నాయి. సీడ్ ప్లాంట్ల యజమానులు.. సన్నాలకు బోనస్‌తో కలిపి మద్దతు ధర చెల్లించేందుకు ముందుకు రావడంతో ఈసారి రైతులకు సిరులు పండే అవకాశాలు కనబడుతున్నాయి.

**1.50 లక్షల క్వింటాళ్ల లక్ష్యం**

ఈసారి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో విత్తనాల కొరత ఏర్పడటంతో డిమాండ్ పెరిగింది. ఇందుకనుగుణంగా ఉమ్మడి జిల్లాలోని 45 సీడ్ ప్లాంట్ల యజమానులు 30 రకాల ఇతర వంగడాలకు సంబంధించిన విత్తనాలిచ్చి సాగు చేయించేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. గతేడాది సుమారు 90 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసిన సీడ్ ప్లాంట్ల యజమానులు.. ఈసారి ఉమ్మడి జిల్లాలోనే వేల ఎకరాల్లో సాగుచేయించి 1.50 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ఎగుమతి చేసేలా లక్ష్యం పెట్టుకున్నారు.



**ఉమ్మడి జిల్లాలో 70 వేల ఎకరాలు**

ఉమ్మడి జిల్లాలో ఆడ–మగ(హైబ్రిడ్) విత్తన వరి సాగు గతేడాది 40 వేల ఎకరాల్లో వేస్తే.. ఈసారి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 70 వేల ఎకరాలకు పెరగనుంది. దాదాపు 35కి పైగా సంస్థలు పోటీపడుతూ రైతులను ప్రోత్సహిస్తున్నాయి.

**ఎకరానికి రూ.80 వేలు ఇచ్చేలా..**

గతేడాది కంటే ఈసారి ఆయా కంపెనీలు క్వింటాలుకు రూ.వెయ్యి నుంచి రూ.4 వేలవరకు ధర పెంచడంతోపాటు విత్తనాలు, వరి కోతల ఖర్చులు భరించనున్నాయి. దిగుబడి వచ్చినా రాకపోయినా ఎకరాకు రూ.80 వేలు ఇచ్చేలా ఒప్పంద పత్రాలు ఇస్తుండటంతో రైతులు సాగుకు ముందుకొస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 9.20 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇందులో ఓపెన్ పాలినేటెడ్(లోకల్ సీడ్), ఆడ–మగ సీడ్ కలిపి 1.55 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశముంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి గుర్తింపు పొందిన సంస్థల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి.

ఆయా కంపెనీల ఆర్గనైజర్ల నుంచి తప్పనిసరిగా ఒప్పంద పత్రాన్ని తీసుకోవాలి. విత్తన ఎంపికతోపాటు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసే సంస్థలను ఎంచుకుంటే మంచిది.

ఆయా సంస్థలిచ్చే విత్తన వివరాలు, రశీదులు, ఒప్పంద పత్రాలను రైతులు భద్రపర్చుకోవాలి.

# జలాశయాలకు కాలుష్య కాటు

హైదరాబాద్: కొందరు పరిశ్రమల నిర్వాహకులు నగరాన్ని వ్యర్థాల డంపింగ్ కేంద్రంగా మారుస్తున్నారు. యథేచ్ఛగా ట్యాంకర్లలో వేల లీటర్ల రసాయన వ్యర్థాలను తరలిస్తూ ఇక్కడి జలాశయాలను కలుషితం చేస్తున్నారు. తాజాగా రాజేంద్రనగర్ పరిధిలో స్థానికులు పట్టుకున్న ట్యాంకర్‌తో కలిపి ఇప్పటి వరకు పీసీబీ 16 ట్యాంకర్లను స్వాధీనం చేసుకుంది. మూసీలో రసాయన వ్యర్థాల డంపింగ్ వ్యవహారం లో కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మూసీ వద్ద భూగర్భ పైపులైను వ్యవస్థ ఏర్పాటు, నకిలీ ఇన్‌వాయిస్‌ల సృష్టి తదితర అంశాల ను గమనిస్తే ఈ దందా భారీ స్థాయిలో జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**ఇటీవల స్వాధీనం చేసుకున్న ట్యాంకర్ల వివరాలివి..**

ఇటీవల రాజేంద్రనగర్‌లో వెలుగులోకి వచ్చిన వ్యర్థాల డంపింగ్ వ్యవహారంలో పాశమైలారం ప్రాంతానికి చెందిన రుద్ర టెక్నాలజీస్ (శ్రీనివాస ల్యాబ్స్) చాకచక్యంగా వ్యవహరించింది. జిప్సంను ఉత్పత్తి చేస్తున్న క్రమంలో వెలువడే హానికర వ్యర్థాలను అటవీ ప్రాంతంలో



పారబోస్తున్నారన్న కారణంతో వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరణ్‌కోట్‌లోని 'రాఘవేంద్ర కెమికల్స్' పరిశ్రమను కాలుష్య నియంత్రణ మండలి 2023 ఏప్రిల్ 11న మూసివేయించింది. సాధారణంగా జిప్సం తయారీ పరిశ్రమల్లో సల్ఫ్యూరిక్, ఫ్లోరిక్, ఫాస్పోరిక్ ఆమ్లాలను వినియోగిస్తారు. వాడేసిన ఆమ్లాలను ఈ పరిశ్రమలు కొనుగోలు చేస్తుంటాయి. రాఘవేంద్ర కెమికల్స్ పరిశ్రమను మూసివేసినా ఆ పరిశ్రమకే వాడేసిన ఆమ్లాలను తరలిస్తున్నట్లు రుద్ర టెక్నాలజీస్ నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి వ్యర్థాల డంపింగ్ సాగిస్తోంది. ఈ క్రమంలోనే నవంబరు 26న బాపూఘాట్ బ్రిడ్జి వద్ద కెమికల్ వ్యర్థాలను అండర్‌గ్రౌండ్ పైపులైను ద్వారా మూసీలో పారబోస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. జులై 10న ఓ ట్యాంకర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబరు 5 వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అది పరిశీలించారు. రసాయన వ్యర్థాలున్నట్లు తెలియడంతో పీసీబీ అధికారులకు సమాచారం అందించారు. ట్యాంకర్‌లో తీసుకొచ్చిన రసాయన వ్యర్థాలను కూకట్‌పల్లి సమీపంలోని ఓ జలాశయంలో పారబోస్తుండగా అక్టోబరు 25న స్థానికులు పోలీసు, పీసీబీ అధికారులకు సమాచారం అందించారు. 2023 డిసెంబరు 29న నల్గొండ జిల్లా చిట్యాల ప్రాంతానికి చెందినదశమి ల్యాబొరేటరీస్‌కు చెందిన ట్యాంకర్ జీడిమెట్లలో పట్టుబడింది.

# ఎన్టీపీసీ నిధులు... చురుగ్గా పనులు

గోదావరిఖని : ఎట్టకేలకు రామగుండం ఎన్టీపీసీ సామాజిక బాధ్యతగా కేటాయించిన రూ.2.11 కోట్లతో గోదావరిఖని మారుతిన గర్‌లోని ఎస్సీ, ఎస్టీ బాలికల వసతి గృహం నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనే పురాతనమైన బాలికల వసతి గృహం క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంది. స్లాబు పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థినులు తీవ్ర ఆందోళనకు గురయ్యేవారు. సుమారు ఏడేళ్ల క్రితం భవన దుస్థితిని పరిశీలించిన ఇంజినీరింగ్ అధికారులు ఈ భవనం ఎట్టి పరిస్థితుల్లో నివాసానికి పనికిరాదని వెంటనే కూల్చివేసి దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని నివేదించారు. ఈ మేరకు 2016లో వసతి గృహంలోని విద్యార్థినులను మంథనికి తరలించారు. సత్వరమే శిథిల భవనాన్ని కూల్చేసి దాని స్థానంలో నూతన భవన నిర్మాణం చేపట్టాలంటూ స్థానిక వార్డెన్ సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. ఎన్టీపీసీ సామాజిక బాధ్యత నిధులతో గోదావరిఖనిలో ఎస్సీ ఎస్టీ బాలికల వసతి గృహ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎన్టీపీసీ అధికారులను కోరారు. ఈ మేరకు నిధులు కేటాయించగా రామగుండం నగరపాలిక ఆధ్వర్యంలో శిథిల భవనాన్ని కూల్చేశారు. పరిశీలన, ప్రణాళికలు, నిధుల కేటాయింపు టెండరు నిర్వహణ తదితర ప్రక్రియ పూర్తి కాగానే భవన నిర్మాణ పనులు చేపట్టారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా ఈ భవన నిర్మాణం పూర్తిచేయాలని



సంకల్పంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.

**విద్యార్థినులకు ప్రయోజనకరం**

రెండంతస్తులతో చేపట్టిన ఎస్సీ, ఎస్టీ భవన నిర్మాణం పూర్తయితే 3వ తరగతి నుంచి మొదలుకొని ఇంటర్, డిగ్రీ ఆపై కోర్సులను అభ్యసించే 200 మంది విద్యార్థినులకు ప్రయోజనం చేకూరనుంది. విశాలమైన వసతి గదులు, భోజనశాల, రీడింగ్ హాల్ తదితర సదుపాయాలతో భవన నిర్మాణం చేపడుతున్నారు. రెండు విభాగాలుగా ఈ భవనంలో ఎస్సీ, ఎస్టీ వసతి గృహం నిర్వహించనున్నారు. ఒక అంతస్తులో 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకునే 100 మంది విద్యార్థినులను, మరో అంతస్తులో ఇంటర్ నుంచి డిగ్రీ తదితర కోర్సులను అభ్యసించే మరో 100 మంది విద్యార్థినులకు కేటాయించనున్నారు. కళాశాలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థినుల కోసం గోదావరిఖనిలోని ఓ అద్దె భవనంలో వసతి గృహం నిర్వహిస్తున్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయితే అత్యాధునికమైన వసతుల తో వసతి గృహం అందుబాటులోకి రానుంది. వసతి సదుపాయం లేక మారుమూల ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థినులు చదువు కు దూరమవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# మేమేం పాపం చేశాం?



చొప్పదండి : వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక చేయూతతోపాటు వారిలో మనోధైర్యాన్ని నింపేలా ఆసరా పింఛన్ పథకాన్ని అమలు చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. కొంతమంది ఆ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇలాంటి వారికి ఒక నెల డబ్బులు రాకపోతే జీవనం గడవడం గగనమవుతుంది. మండలానికి చెందిన పలువురు వృద్ధులు సాంకేతిక తప్పిదంతో నాలుగు నెలలుగా పింఛన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడు తున్నారు. తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక బ్యాంకులు, మండలపరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల్ల తిరుగుతున్నారు.

**బతికుండగానే మరణించినట్లుగా..**

మండలంలోని కొలిమికుంట, గుమ్లాపూర్, రెవెల్లి గ్రామాల్లోని 8 మంది వృద్ధులకు, చొప్పదండి పురపాలక సంఘం పరిధిలో అయిదుగురికి పింఛన్ నాలుగు నెలలుగా రావడంలేదు. వీరు చొప్పదండి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి ఉన్నారు. సాంకేతిక తప్పిదం కారణంగా వీరు బతికి ఉండగానే మృతి చెందినట్లు చూపించడంతో వీరి పింఛన్లు నిలిచిపోయాయి. వారు నాలుగు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా వారి సమస్య పరిష్కారం కావడంలేదని ఆందోళన చెందుతున్నారు.

**పురపాలక కార్యాలయంలో తెలియజేశా..**

ప్రతి నెల బ్యాంకుకు వెళ్లి చూస్తే మీ ఖాతాలో పింఛన్ డబ్బులు లేవని చెబుతున్నారు. వృద్ధాప్యంలో ఆ డబ్బులు అండగా ఉంటాయని భావిస్తే ఇలా జరిగింది. చేసేదేమి లేక పురపాలక సంఘం కార్యాలయంలో వివరాలు అందజేశా. వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బొడిగె హన్మయ్య, చొప్పదండి

ఆధారం కరవైంది

ప్రతి నెల వచ్చే పింఛన్ పైసలు నా జీవనానికి ఆధారమయ్యేవి. కానీ నాలుగు నెలలు రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నా. పునరుద్ధరించాలని కోరుతూ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాను. కానీ నేటికీ పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులు చొరవ చూపి త్వరగా మా సమస్యను పరిష్కరించాలి.

కొత్తడ సత్తమ్మ, రెవెల్లి

**ఉన్నతాధికారులకు నివేదించాం**

మండలంలో 8 మందికి ఈ తరహా సమస్యతో పింఛన్ నిలిచిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. వారి వివరాలను తీసుకుని పునరుద్ధరించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఇంకా ఏవరైనా ఇదే సమస్యతో పింఛన్ రాకపోతే మా కార్యాలయంలో వారి వివరాలు అందజేయండి.

వేణుగోపాల్, ఎంపీడీవో, చొప్పదండి

బ్యాంకు పొరపాటు లేదు..వృద్ధుల పింఛన్ ఆగిపోవడంలో బ్యాంకు తప్పిదం ఏమీ లేదు. సాంకేతిక కారణంతో ఏదైనా సమస్య ఏర్పడితే సంబంధిత అధికారులు వారి జాబితాతో వివరాలు ఇస్తే వాటిని సరి చేస్తాం. మా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు.సందీప్, మేనేజర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు, చొప్పదండి

# తవ్వడం.. పూడ్చటం



కరీంనగర్ : బైపాసు రోడ్డులో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ భవనం పూర్తి చేసేందుకు సదరు గుత్తేదారు సిద్ధంగా ఉండగా ఏజెన్సీ నిర్వాహకులు డిజైన్లు ఇవ్వడంలో నెలల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారు. రాజీవ్‌చౌక్ ఎదురుగా డ్రైనేజీ కోసం అడ్డుగోడ నిర్మించారు. గతంలోనే ఇక్కడ పనులన్నీ పూర్తి చేయగా మళ్లీ తవ్వడం, పనులు చేయడం ఏమిటని, ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని దుకాణ యజమానులు ఆగ్రహిస్తున్నారు.నగరంలో స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన పనులను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖ గడువు విధించింది. ముందస్తు ప్రణాళికలతో జాప్యం లేకుండా చకచకా చేయాల్సిన పనులు సాధారణ పనుల తరహాలో నత్తనడకన సాగుతున్నాయి. పనులు పూర్తయిన తర్వాత మళ్లీ తవ్వడం, పూడ్చటం ఇలా ఇంకెన్నాళ్లు చేస్తారని ఆయా ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టవర్‌సర్కిల్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో తుది దశ పనులలో కావాలనే జాప్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.

**నిర్వహణపై పట్టింపేదీ?**

ఆకర్షణీయ పనులు పూర్తి చేసిన చోట వస్తున్న ఇబ్బందులను ఆర్వీ కన్సల్టెన్సీ కానీ, ఏజెన్సీ కానీ పట్టించుకోవడం లేదు.

స్మార్ట్ రహదారులకు పక్కన ఉన్న రెయిలింగ్ చెడిపోయినా, ఫుట్‌పాత్ టైల్స్, అప్రోచ్ రోడ్డు ఊడిపోయినా మరమ్మతులు చేయడం లేదు.

పలు చోట్ల వీధిదీపాలు వెలగడంలేదు. కొత్తగా బిగించిన వాటికి మీటర్లు తీసుకోకపోవడంతో అవీ పని చేయడం లేదు.

గౌతమినగర్‌లో కొంతదూరం రోడ్డు వేయకుండా వదిలేశారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో లైట్లు వెలిగిస్తామని చెప్పి హడావుడి చేసి వదిలేశారు.

మ్యకల్ బైపాసు రోడ్డులో ఫ్లైఓవర్ కింద కూడలి నిర్మించేందుకు పనులు చేయగా రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఫౌంటెయిన్, గార్డెనింగ్ పనులు పెండింగ్‌లో ఉంచారు. ఎప్పటిలోగా చేస్తారో తెలియకుండా మారింది.

25 ప్రాజెక్టులు పూర్తి

మొత్తం 47 ప్రాజెక్టులను ఎంపిక చేసుకోగా రూ.934.35 కోట్లు కేటాయించారు.

25 ప్రాజెక్టులు రూ.643.66 కోట్లతో పూర్తి చేశారు.

మిగతా 20 ప్రాజెక్టులను రూ.267.74 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

రెండు రూ.25.40 కోట్లతో మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఇతర పనులకు టెండర్ పిలవాల్సి ఉంది.

రూ.2 కోట్లతో ఇటీవల బాలసదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పనులు వారే చేయాలి

స్మార్ట్‌సిటీలో అసంపూర్తి పనులు ఏజెన్సీ వారే చేయాలి. ఫైనల్ బిల్లులు ఇవ్వలేదు. టవర్‌సర్కిల్ గంజ్ రోడ్డులో విద్యుత్తు కనెక్షన్ ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయి. ఎక్కడైన వదిలేసిన డ్రెయిన్స్, ఇతరత్రా పనులు పూర్తి చేస్తున్నారు. రాజ్‌కుమార్, ఎస్‌ఈ, నగరపాలిక

# ఆహార శుద్ధి పరిశ్రమలో అతివలు




పెద్దపల్లి : పైసా పైసా పొదుపు చేసి ఆర్థిక స్వావలంబన దిశగా ఎదుగుతున్న అతివలు ఇకపై ఆహారశుద్ధి పరిశ్రమలనూ స్థాపించబోతున్నారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్ వసతి కల్పించి, ఆహార పదార్థాల తయారీ దిశగా సిద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా ముత్తారంలో మిర్చి పొడి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, నెఫ్టెమ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్) స్వచ్ఛంద సంస్థ సహకారంతో పరిశ్రమ నెలకొల్పనుండగా కొద్ది రోజులుగా మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

**అక్కడే ఎందుకు?** సుగంధద్రవ్యాల పంటగా పిలిచే మిర్చి జిల్లాలో ముత్తారం, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో సుమారు 800 ఎకరాల్లో సాగవుతోంది. ఇందులో అత్యధికంగా ముత్తారం మండలం లో పండిస్తున్నారు. సాగులోనూ మహిళా రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు స్థానికంగా మార్కెట్ వసతి లేక వరంగల్, ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. అంత దూరం వెళ్లినా గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారు. ఇక్కడ పండించిన మిర్చి పంట నుంచి స్థానికంగా పౌడర్ తయారు చేస్తే రైతులకు మద్దతు ధర అందడంతో పాటు తమకు ఉపాధి లభిస్తుందని మహిళలు ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చారు.

**నాణ్యతకు పెద్దపీట**ఆహారశుద్ధి పరిశ్రమలో మిర్చి పౌడర్, సాస్, చిల్లి ఫ్లేక్స్ తయారు చేయనుండగా బహిరంగ మార్కెట్‌లో కార్పొరేట్ కంపెనీల పోటీని తట్టుకునేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిర్ణయించారు. 'పెద్దపల్లి' బ్రాండ్ పేరుతో వీటిని విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా ముత్తారం మండలంలోని 14 మంది రైతులను ఎంపిక చేసి బెంగళూరు నుంచి తెచ్చిన మేలిరకం విత్తనాలను వారితో సాగు చేయించారు. జిల్లాలో సుమారు 90 వేల మంది అతివలు స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. మిర్చి నిత్యావసరమైనందున అతివలు తయారు చేసిన ఉత్పత్తులను వీరు కొనుగోలు చేసేలా అధికారులు ప్రోత్సహించనున్నారు.

**750 మంది భాగస్వామ్యం**

ముత్తారం మండలంలోని స్వశక్తి మహిళలు, ఇతరులు కలిపి 750 మంది అతివలతో నెఫ్టెమ్ సహకారంతో దాదాపు ఆరు నెలల కిందట మహిళా రైతు ఉత్పాదక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సభ్యురాలు తన వాటాగా రూ.2 వేలు చెల్లించగా రూ.15 లక్షలు జమయ్యాయి. మరో రూ.15 లక్షలు నెఫ్టెమ్ సంస్థ రుణంగా అందించనుంది. మొత్తం రూ.30 లక్షలతో ఆహారశుద్ధి పరిశ్రమను ప్రారంభించనున్నారు. వ్యాపార నైపుణ్యాలపై ప్రస్తుతం మహిళలకు నెఫ్టెమ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. నష్టాలు రాకుండా సంఘటితంగా వ్యవహరించేందుకు సమన్వయం చేస్తున్నారు.

**ఫిబ్రవరిలో ఉత్పత్తి ప్రారంభం**

ముత్తారం మండలంలో మిర్చి పంట అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. పౌడర్ తయారు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపారు. ఇక్కడి రైతులకు మార్కెట్ వసతి కల్పించి ఉత్పత్తులు పెంచాలని నిర్ణయించారు. పౌడర్‌లో నాణ్యత పాటించనుండటంతో విక్రయాలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. వచ్చే ఫిబ్రవరిలో ఉత్పత్తి ప్రారంభమవుతుంది.రవీందర్‌రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# ఎనిమిదేళ్లు దాటినా ఏటా కష్టాలే!

ధర్మారం : ఉమ్మడి జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు నీరందించాలని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించినా లక్ష్యం నెరవేరడం లేదు. అందుబాటులోకి వచ్చి ఎనిమిదేళ్లు దాటినా పనులు పూర్తి కాకపోగా పైపులైన్లు, వాల్వులు దెబ్బతినడం పరిపాటిగా మారింది. నిరంతర పర్యవేక్షణ లేకపోవడం రైతులకు శాపంగా మారుతోంది.

20.175 టీఎంసీల సామర్థ్యమున్న ఎల్లంపల్లి జలాశయం ద్వారా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని 1,51,400 ఎకరాల కొత్త ఆయకట్టుకు 12 టీఎంసీల నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంథని నియోజకవర్గంలోని గుండారం రిజర్వాయరు మీదుగా లక్కారం జలాశయం ద్వారా 7,841 ఎకరాల కొత్త ఆయకట్టు, 7 వేల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు 2 టీఎంసీలు కేటాయించారు. ప్రాజెక్టు రెండో దశ, ఫేజ్-1, ఒకటో ప్యాకేజీలో వేమునూరు, నందిమేడారం, గంగాధర, కొడిమ్యాల, ఎల్‌టి.పోతారం, జోగాపురం వద్ద ఆరు లిఫ్టులు ఏర్పాటు చేసి చెరువులను నింపడం ద్వారా 1.51 లక్షల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



**ఇలా చేస్తే సజావుగా ఎత్తిపోతలు**

పైపులైన్లపై పోసిన మట్టిని చదును చేసి పంటలు వేస్తుండటంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఎత్తిపోతల సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలి. నీటి ఒత్తిడికి పైపులైన్లు పైకి లేవకుండా ఉండేందుకు మట్టి పోశారు. దాన్ని స్థానిక అవసరాలకు తరలించకుండా పర్యవేక్షించాలి.

**సమస్యగా భూ సేకరణ**

మంగపేట వద్ద 86 ఎకరాలకు ఇటీవల ప్రభుత్వం పరిహారం ఇచ్చింది. మరో 11 ఇళ్లకు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. నారాయణపూర్ జలాశయం కట్ట దిగువన 24 ఇళ్లకు పరిహారం చెల్లింపు, కొడిమ్యాల మండలంలో 147 ఎకరాలు సేకరించాల్సి ఉంది. లచ్చపేట రిజర్వాయరుకు కాలువ ద్వారా నీటిని తరలించాల్సి ఉండగా అటవీ శాఖ భూమి అడ్డుగా ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నాగారం కొత్తచెరువు, రుద్రంగి చెరువులకు నీటి తరలింపునకు అవరోధంగా మారింది. గంగాధర నుండి స్తంభంపల్లి, వేములవాడ చెరువులకు నీటిని తరలించే కుడికాలువ 19 కిలోమీటర్లకు 18 కిలోమీటర్లు తవ్వారు. మరో 1200 మీటర్లు తవ్వితే ఈ రెండు చెరువులకు నీరందుతుంది.

**తరచూ అవరోధాలు**

ఏటా యాసంగి అవసరాలకు జనవరిలో ఎత్తిపోతలు ప్రారంభించి జలాశయాలను నింపుతున్నారు. ప్రారంభానికి ముందే నందిమేడారం జలాశయం దిగువన పైపులైన్ల కిందకు నీళ్లు చేరి ఒత్తిడితో పైపులు పైకి లేవగా మరమ్మతు చేశారు. గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలోనూ ఇలాగే లేవగా సరి చేయకుంగానే ఎత్తిపోతలు చేపడుతున్నారు. 2021లో భారీ వర్షాలకు ధర్మారం మండలం కటికెనపల్లి వద్ద పైపులైన్లు దెబ్బతినడంతో మరమ్మతు చేపట్టి 2002లో రెండు నెలలు ఆలస్యంగా మార్చిలో ఎత్తిపోతలు ప్రారంభించారు. సగం పొలాలు ఎండి రైతులు పెట్టుబడి నష్టపోయారు. 2022లో భారీ వర్షాలకు నారాయణపూర్, గంగాధర చెరువులు దెబ్బతిన్నాయి. దీంతో మరమ్మతు చేపట్టి 2023 ఫిబ్రవరి 28న ఎత్తిపోతలు ప్రారంభించగా పంపుహౌస్ ప్రెషర్ మెయిన్ వాల్వు దెబ్బతిని వారం రోజులు ఆలస్యమైంది.

**ఏడాదిలోగా పనులు పూర్తి**

వేర్వేరు కారణాలతో చాలా కాలంగా పనులు జరగలేదు. ఇటీవలే మొదలయ్యాయి. అటవీ శాఖ భూములు అడ్డుగా ఉండటంతో భూ సేకరణ ఆలస్యమవుతోంది. ఏడాదిలోగా పనులన్నీ పూర్తవుతాయి. వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో పనులు చేయిస్తున్నాం. సత్యప్రకాష్, నీటిపారుదల శాఖ ఈఈ

# అంగన్‌వాడీలకు విద్యుత్తు వెలుగులు

పాల్వంచ : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్తు వెలుగులు ప్రసరించను న్నాయి. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చొరవ తీసుకోవడంతో చిన్నారులు, టీచర్లకు విద్యుత్తు సమస్యలు తీరనున్నాయి. కొత్త భవనాలతో పాటు అద్దె భవనాల్లో సైతం విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఇప్పటికే గుర్తించిన అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు మీటర్లను సరఫరా చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహణలో ఉన్నాయి. వీటిలో 952 కేంద్రాలకు విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో చీకట్లో మగ్గుతున్నాయి. వేసవిలో ఉక్కపోతతోనే కాలం




వెళ్లదీయాల్సి వచ్చేది. అలాంటి సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుంది.

**క్షేత్ర స్థాయిలో గుర్తించి..**వివిధ కేంద్రాల్లో విద్యుత్తు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన సందర్భాల్లో కేంద్రాల్లో చీకట్లోనే చిన్నారులకు బోధన సాగిస్తుండటాన్ని గమనించారు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని భావించి ఒక్కో కేంద్రానికి రూ.2,700 చొప్పున మొత్తం రూ.23 లక్షలతో కొత్త మీటర్లకు నిధులు విడుదల చేశారు. సంబంధిత ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందజేసి ప్రాజెక్టుల వారీగా విద్యుత్తు కనెక్షన్లు లేని సమాచారం సేకరించి మీటర్లు మంజూరు చేశారు. ఇప్పటికే విద్యుత్తు మీటర్లను పంపిణీ చేయగా.. వాటికి కావాల్సిన తీగలు, స్విచ్‌బోర్డు, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది.

జిల్లాలోని పదకొండు ప్రాజెక్టుల వారీగా విద్యుత్తు కనెక్షన్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి మీటర్లు అందజేశాం. కొత్త కనెక్షన్లు అమర్చటానికి, గ్రామాల్లో పంచాయతీ, పట్టణాల్లో పురపాలిక అధికారులు విద్యుత్తు మరమ్మతులు చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి.




# 8వ వేతన సంఘం ఏర్పాటు.. కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వేతన సంఘం సిఫార్సుల మేరకు వేతనాలు పెరగనున్నాయి. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి రానున్నాయి. త్వరలోనే కొత్త కమిషన్ ఛైర్మన్, ఇద్దరు సభ్యులను నియమించనున్నారు.

**షార్‌లో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు ఆమోదం...** శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్‌ను నిర్మించనున్నారు. ఎన్‌జీఎల్‌వీ, ఎల్ఎంవీ3 ప్రయోగాలకు అనుగుణంగా మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఎన్‌జీఎల్‌వీ ద్వారా భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. మనుషులను రోదసిలోకి పంపడానికి అనుకూలంగా లాంచ్‌ప్యాడ్ రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. నాలుగేళ్ల వ్యవధిలో దీనిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు.

# మహా కుంభమేళాలో శ్రీవారికి వైభవంగా స్నపన తిరుమంజనం, చక్రస్నానం




తిరుమల: ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సమ్మేళనమైన మహా కుంభ మేళాలో ప్రయాగ్ రాజ్ లోని దశాశ్వమేధ ఘాట్ వద్ద గురువారం స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని తితిదే ఘనంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకుల బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాసస్వామివారికి స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని పవిత్ర గంగా నది ఒడ్డున కన్నుల పండువగా నిర్వహించారు.

పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన స్నపన తిరుమంజనం స్థానిక భక్తులను భక్తి పారవశ్యానికిలోను చేసింది. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీ సూక్తం, భూసూక్తం, నీలా సూక్తం, పురుష సూక్తం, నారాయణ సూక్తం, మొదలైన పంచ సూక్తాలను అర్చకులు వల్లించారు. అభిషేకానంతరం తులసి మాలలతో ఉత్సవ మూర్తులను అలంకరించారు. సహస్రధారాపాత్రతో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదనంతరం శ్రీ చక్రతాళ్వా ర్‌ను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ గంగా నదిలోకి తీసుకువెళ్లారు. అక్కడ శ్రీ చక్రతాళ్వార్ కు ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించి చక్రస్నాన మహోత్సవాన్ని నిర్వహించారు.

# 18న ఆంధ్రప్రదేశ్ పర్యటనకు అమిత్ షా




అమరావతి: కేంద్ర హోంమంత్రి అమిత్ షాఆదివారం (18వ తేదీ) ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రానున్నారు. కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం ప్రాంగణాలను కేంద్ర హోం మంత్రి ప్రారంభించనున్నారు. శనివారం రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరానికి వస్తారు. ఆ రోజు రాత్రి ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో అమిత్ షాకు విందు ఏర్పాటు చేశారు. అనంతరం విజయవాడలోని హోటల్లో బస చేస్తారు. 19న ఉదయం ఎన్ఐడీఎం కేంద్రం, ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్‌ను ఆయన ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులు పాల్గొంటారు. ప్రారంభోత్సవం తర్వాత అమిత్ షా బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్మించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు పదో బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ క్యాంపులను అమిత్ షా ప్రారంభిస్తారు. ఇవి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనివి కావడంతో ఆయన ప్రత్యేకంగా వస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా కూడా ఆసక్తి రేపుతోంది. అమిత్ షా పర్యటన కోసం ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. సాధారణంగా రాజకీయాలను అమిత్ షానే పట్టించుకుంటుంటారు. పాలన పరంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజీగా ఉంటారు. అయితే అంతిమ నిర్ణయం తీసుకునేది ప్రధాని మోదీనే. పనులన్నీ చక్కబెట్టేది అమిత్ షా. ఏపీ పర్యటనలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ ముగ్గురి మధ్య రాజకీయ చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా ఏపీలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఏడు నెలలు గడుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పరిస్థితులను చక్కదిద్దుతూ ముందుకు సాగుతున్నారు. వైఎస్సార్‌సీపీ నిర్వాకాల కారణంగా ఎన్నో బ్యాక్ లాగ్స్ పెండింగ్‌లో ఉన్నాయని .. వాటిని క్లియర్ చేయాల్సి ఉందని అంటున్నారు. జగన్ హయాంలో జరిగిన అనేక అవకతవకలపై నివేదికలు సిద్ధంగా ఉన్నాయి. అందులో కొన్నింటిలో కేంద్ర దర్యాప్తు సంస్థల ఇన్వాల్వ్ మెంట్ అవసరమని భావిస్తున్నారు. ఈ క్రమంలో అన్నింటిపై ముగ్గురు నేతల మధ్య చర్చలు జరిగే అవకాశముందని తెలియవచ్చింది.




తిరువనంతపురం: కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో గోపన్ స్వామి అనే వ్యక్తి జీవ సమాధి అంశం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఆ సమాధిని తవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో పోలీసులు సమాధిని తవ్వి ఆయన మృతదేహాన్ని వెలికితీశారు. సమాధి వద్దకు ఉదయం 7 గంటల సమయంలో చేరుకున్నామని.. దానిని తవ్వడాన్ని కుటుంబసభ్యులు తీవ్రంగా వ్యతిరేకించడంతో భారీ భద్రత నడుమ కాంక్రీటుతో నిర్మించిన గోపన్ స్వామి సమాధిని తవ్వామని పోలీసులు పేర్కొన్నారు. లోపల ఆయన మృతదేహం ధ్యాన స్థితిలో ఉందని.. ఛాతి వరకు పూజా సామగ్రి నింపి ఉందని తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువనంతపురంలోని మెడికల్ కాలేజీకి తరలించినట్లు పేర్కొన్నారు. గోపన్ స్వామి అలియాస్ మణ్యన్ జీవ సమాధి అయ్యారని కొన్నిరోజుల క్రితం ఆయన కుటుంబీకులు పోస్టర్లు ప్రచురించారు. బంధువులు, స్థానికులకు తెలియకుండా అతన్ని నెయ్యటింకరలోని ఓ దేవాలయం సమీపంలో పూడ్చిపెట్టడంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఎవరూ చూడకుండా తనను సమాధి చేయాలని గోపన్ చెప్పినట్లు ఆయన కుమారులు సనందన్, రాజేశన్ పేర్కొన్నారు. ఈవిషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో.. సబ్ కలెక్టర్ ఆల్ఫ్రెడ్ ఓవీ తన సిబ్బందితో వెళ్లి సమాధిని తవ్వాలని ఆదేశించారు. ఈ చర్యను గోపన్ స్వామి భార్య, కుమారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు న్యాయపరంగా ముందుకెళ్లారు. సమాధిని తవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో మరోసారి ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనపై విచారణ జరిపిన హైకోర్టు సమాధిని తవ్వి తీరాల్సిందేనని ఆదేశించింది.

# 2025: మహా కుంభమేళా 2025.. గూగుల్ గులాబీల వర్షం

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా జరుగుతోంది. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది తరలివస్తున్నారు. ఈక్రమంలోనే ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ కుంభమేళాను సృజనాత్మకంగా సెలబ్రేట్ చేసింది. తన సెర్చ్ ఇంజిన్ ప్లాట్‌ఫామ్‌లో గులాబీ రేకులతో కూడిన వర్చువల్ యానిమేషన్‌ను జోడించింది. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గూగుల్‌లో 'కుంభమేళా', 'మహా కుంభమేళా'.. అని సెర్చ్ చేయగానే గులాబీ రేకులతో రూపొందించిన యానిమేషన్ కనిపిస్తుంది. గులాబీల వర్షం పడుతున్నట్లు కనిపించే ఆ యానిమేషన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ ఇంటరాక్టివ్ ఫీచర్ మహా కుంభమేళా వైభవాన్ని గుర్తుచేస్తోంది. ఈ యానిమేషన్‌ను షేర్ చేసే సదుపాయం కూడా గూగుల్ అందిస్తోంది. కావాలనుకుంటే ఫేస్‌బుక్, వాట్సప్, 'ఎక్స్', ఇ-మెయిల్ ద్వారా ఈ యానిమేషన్‌ను మీకు నచ్చినవారికి షేర్ చేయొచ్చు. మీరు కూడా ఓసారి ట్రై చేయండి.

**హిండెన్‌బర్గ్ మూసివేత.. సంచలన నిర్ణయం ప్రకటించిన ఫౌండర్ :** పన్నెండేళ్లకు ఒకసారి జరిగే ఈ కుంభమేళా సోమవారం ప్రారంభమై ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. ఈ కుంభమేళా ముగింపు నాటికి 40 కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అంచనా. ఇలా 45 రోజుల పాటు సాగే ఈ మేళా ద్వారా రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు రూ.2 లక్షల కోట్ల మేర ఆదాయం సమకూరనుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# ఏపీ వాలంటీర్ల కీలక నిర్ణయం-కేబినెట్ కేంద్రంగా తాజా వ్యూహం..!

అమరావతి : ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం నియమించిన వాలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం పూర్తిగా పక్కనబెట్టేసింది. కూటమి సర్కార్ అధికారంలోకి వస్తే వాలంటీర్లకు జీతాలు రెట్టింపు చేసి మరీ కొనసాగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన అధికార పార్టీలు.. ప్రభుత్వం వచ్చాక మాత్రం వారిని వదిలేశాయి.

దీంతో అప్పటి నుంచీ నిరసనలు చేస్తున్న వాలంటీర్లు తాజాగా మరో వ్యూహం ఎంచుకున్నారు. దీనిపై నిన్న విజయవాడలో ప్రకటన చేశారు. వాలంటీర్ల కొనసాగింపుకు అసలు ఈ వ్యవస్థను నియమిస్తున్నట్లు గత ప్రభుత్వం జీవో ఇవ్వకపోవడమే ప్రధాన కారణమని చెబుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో మరి కొనసాగిస్తామని ఎలా హామీ ఇచ్చారని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే జీతాలు పెంచుతామని ఎలా చెప్పారని అడుగుతున్నారు. సంక్రాంతి సందర్భంగా అందరి బకాయిలు తీర్చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం తమ జీతాల బకాయిలు ఎప్పుడు తీరుస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఇవే అంశాలతో ఓ వినతిపత్రం తీసుకుని రేపు అమరావతిలో జరిగే ఏపీ కేబినెట్ భేటీకి వెళ్తామని, అక్కడ సీఎం చంద్రబాబుకు ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలంటూ ఓ వినతిపత్రం సమర్పిస్తామని వాలంటీర్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాలంటీర్లు అంతా సీఎంను కలిసేందుకు ఈ నెల 17న అమరావతి వస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటివరకూ తమకు పెండింగ్ ఉన్న జీతాల్ని చెల్లించలేదని, సంక్రాంతి సందర్భంగా గుడ్ న్యూస్ చెప్తారని ఇప్పటివరకూ ఎదురుచూశామని గుర్తుచేస్తున్నారు. ఇప్పటివరకూ మంత్రులతో చెప్పిస్తున్నారని, చంద్రబాబు, పవన్ చెప్పడం లేదని అందుకే వారినే అడగేందుకు వెళ్తున్నట్లు తెలిపారు.




# కృష్ణా నదీ జలాల విషయంలో ఏపీకి బిగ్ రిలీఫ్..

న్యూఢిల్లీ, జనవరి 16: కృష్ణా నదీ జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. నీటి వాటాల పంపిణీపై కృష్ణా నదీ జలాల ట్రైబ్యునల్‌లో ఉపశమనం లభించింది. ఈ విషయంలో ఏపీ వాదనలతో ట్రైబ్యునల్ ఏకీభవించింది. 2023 ఆర్డినెన్స్ ప్రకారం నీటి కేటాయింపులపై.. విడివిడిగా వాదనలు వినేందుకు ట్రైబ్యునల్ సమ్మతి తెలిపింది. ఫిబ్రవరి 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు.. రాష్ట్ర వాదనలు వినేందుకు ట్రైబ్యునల్ అంగీకారం తెలిపింది. తొలుత విభజన చట్టంలోని సెక్షన్ 89 మేరకు.. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై వాదనలు వినిపించారు. 811 టీఎంసీల్లో ఏపీ వాటా 512 టీఎంసీలను కొనసాగించాలన్న ఏపీ వాదనలు వినేందుకు ట్రైబ్యునల్ అనుమతి ఇచ్చింది. అయితే, ఈ మొత్తం నీటిలో తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే దక్కుతాయని ఏపీ వాదనలు వినిపించనుంది.

# ఏపీకి కొత్త పరిశ్రమలు.. మంత్రి రాంప్రసాద్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



ఉమ్మడి నెల్లూరు జిల్లా: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధిలో ఏపీ ముందుకు దూసుకెళ్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. నాయుడుపేటలో ఇవాళ(గురువారం) మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలవుతుందని చెప్పారు.

మహిళలకు మూడు సిలిండర్లు, 64 లక్షల మందికి 30వ తేదీన పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. వెనక్కి వెళ్లిన పరిశ్రమలన్నీ తిరిగి మళ్లీ రాష్ట్రానికి వస్తున్నాయి..కొత్త పరిశ్రమలు క్యూ కడుతున్నాయని అన్నారు. శ్రీ సిటీని అభివృద్ధి చేసి ఉద్యోగ అవకాశాలు మెండుగా కల్పిస్తామని హామీ ఇచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ సంబంధించి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

# ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ.. సౌకర్యాల లేమిపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం



ఏలూరు: మంత్రి నాదెండ్ల మనోహర్ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలు, సేవలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాల స్థాయిలో సౌకర్యాలు లేవని అసహనం వ్యక్తం చేశారు. రోగులను తీసుకెళ్లేందుకు వీల్‌ఛైర్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. శౌచాలయాల నిర్వహణ దారుణంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని.. లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రకాశం జిల్లాలో విషాదం.. సముద్రంలో ఆరుగురు గల్లంతు



సింగరాయకొండ: ప్రకాశం జిల్లా సింగరాయకొండలో విషాదం చోటుచేసుకుంది. సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లిన ఆరుగురు గల్లంతయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న మెరైన్ పోలీసులు.. స్థానిక మత్స్యకారుల సాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు. ఇద్దరు బాలికలు, యువకుడి మృతదేహాలు లభ్యం కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు పొన్నలూరు మండలం శివన్నపాలెంకు చెందిన నోసిన జెస్సిక (15), నోసిన మాధవ (25), కందుకూరు మండలం కొల్లగుంట గ్రామానికి చెందిన యామిని (16)గా గుర్తించారు. గల్లంతైన మరో ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోంది.

## ఐదేళ్ల క్రితం నాటి ప్రకటనకి ఇప్పటికి మోక్షం!

ఇటీవలే బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ స్త్రీ-2 తో మరో భారీ విజయాన్ని ఖాతాలో వేసకున్న సంగతి తెలిసిందే. సినిమా బాక్సాఫీస్ వద్ద 800 కోట్లకు పైగా వసూళ్లను సాధించి 2024 ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ విజయంతో శ్రద్ధా కపూర్ స్టార్ డమ్ అంతకంతకు రెట్టింపు అయింది. దీంతో ఆగిపోయిన సినిమాల్ని సైతం మేకర్స్ పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగా ఐదేళ్ల క్రితం ప్రకటించిన నాగిన్ ప్రాజెక్ట్ ను ఈ ఏడాది చిత్రీకరణకు రెడీ అవుతున్నారు. శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రల్లో విశాల్ ఫ్యూరియా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు 5 ఏళ్ల క్రితమే ప్రకటించారు. కానీ ఎందుకనో సినిమాని పట్టాలెక్కించలేదు. ప్రకటించిన తర్వాత ఇద్దరు



వేర్వేరు సినిమాలు చేసారు తప్ప! నాగిన్ ప్రాజెక్ట్ ని మాత్రం పట్టాలెక్కించలేదు. తాజాగా ఈ సినిమా షూటింగ్ మొదలవుతుందని నిర్మాత నిఖిల్ ద్వివేది కూడా తెలిపారు. షూటింగ్ కోసం టీమ్ అంతా రెడీ అవుతున్నట్లు పేర్కొన్నారు. నాగిన్ అనేది ఓ ప్రేమ కథ. ప్రేమ, త్యాగాలకు సంబంధించిన ఓ గొప్ప కథ. మరికొద్ది రోజుల్లోనే సెట్స్ కు వెళ్తుంది అని స్పష్టం చేసారు. మొత్తానికి ఐదేళ్ల తర్వాత నాగిన్ కి మోక్షం కలగడం విశేషం. శ్రద్ధా కపూర్ స్టార్ డమ్ రెట్టింపు అవ్వడంతోనే దర్శక, నిర్మాతలు ఈ ఛాన్స్ తీసుకుంటున్నారు. లేదంటే? ఈ చిత్రాన్ని పట్టాలెక్కించే అవకాశం ఉండేదా? కాదా? అని కొందరు భావిస్తున్నారు. అలాగే ఈసినిమా కోసం శ్రద్ధా కపూర్ భారీగానే పారితోషికం తీసుకుంటుందిట. ఆమె స్టార్ డమ్ ఆధారంగా కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తుందిట. అయితే ఈ కథలో ఏమైనా మార్పులు చేసారా? లేక ఐదేళ్ల క్రితం రాసిన కథనే యధావిధిగా తీసేస్తున్నారా? అన్నది తెలియాలి. మరి స్త్రీ లో దెయ్యం పాత్రలో అలరించిన కపూర్ బ్యూటీ, నాగిన్ లో ఎలాంటి పాత్ర పోషిస్తుంది? అన్నది తెలియాలి. ప్రస్తుతం శ్రద్ధా కపూర్ ఏ కొత్త ప్రాజెక్ట్ లకు కూడా సైన్ చేయలేదు. నాగిన్ పూర్తి చేసిన తర్వాతే కొత్త ప్రాజెక్ట్ లు పట్టాలెక్కించే అవకాశం ఉంటుంది.

## మాజీ ప్రియుడి గురించి పీసీ బహిరంగంగా

ఇండస్ట్రీ ఔట్ సైడర్ ప్రియాంక చోప్రా ఒక నటిగా ఎంతో సాధించింది. గ్లోబల్ స్టార్‌గా ఎందరికో స్ఫూర్తి. బాలీవుడ్ టు హాలీవుడ్ పీసీ ప్రయాణం, విజయాల గురించి ప్రజలకు తెలుసు. ప్రపంచ సుందరిగా కిరీటం గెలుచుకున్న ప్రియాంక చోప్రా, బాలీవుడ్ అగ్ర కథానాయికగా ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించింది. అయితే కింగ్ ఖాన్ షారూఖ్ ఖాన్ తో పీసీ ప్రేమాయణం నిజంగా తన కెరీర్ ని నాశనం చేసిందని చాలా ప్రచారం ఉంది. షారూఖ్ తో డాన్ 2 సమయంలో ఎంతో సన్నిహితంగా మారిన ప్రియాంక చోప్రాను గౌరీఖాన్ సైతం హెచ్చరించిందని, తన భర్తకు దూరంగా పెట్టేందుకు ప్రయత్నించిందని కథనాలొచ్చాయి. షారూఖ్ తో పీసీ చనువును గౌరీఖాన్ అస్సలు సహించలేకపోయిందని, ఆ తర్వాత పరిణామాలు వేగంగా మారిపోయాయని, ఉన్నట్టుండి సడెన్ గా పీసీ కెరీర్ డౌన్




ఫాల్ అవ్వడం, దేశం విడిచి వెళ్లిపోవాలనుకోవడం లాంటి విషయాలు చర్చకు వచ్చాయి. ప్రియాంక చోప్రా బాలీవుడ్ వదిలి వెళ్లిపోవడానికి కారణం గౌరీఖాన్ సన్నిహితుడు కరణ్ జోహార్ అని క్వీన్ కంగన రనౌత్ పలు సందర్భాల్లో వాదించారు. మాఫియా పీసీని బెదిరించిందని కంగన బహిరంగ వేదికపైనే విమర్శించింది. ఇదిలా ఉంటే, ప్రియాంక చోప్రా ఇటీవల షారుఖ్ ఖాన్ తో పాత రిలేషన్ పై ఊహాగానాలను మరోసారి రగిలించింది. తాను ఎంతగానో ఇష్టపడే లెదర్ జాకెట్ గురించి చెబుతూ అది తన 'మాజీ బాయ్ ఫ్రెండ్స్'లో ఒకరికి చెందినదని చెప్పింది. 'డర్టీ లాండ్రీ' అనే టాక్ షోలో మాట్లాడుతూ.. ఆ జాకెట్‌ను తన 'ఎయిర్ పోర్ట్ జాకెట్'గా అభివర్ణించింది. అయితే ఇంతలోనే నెటిజనులు పీసీ లెదర్ జాకెట్ తో పాటు, షారూఖ్ ధరించిన లెదర్ జాకెట్ ఫోటోని జోడించి వైరల్ చేయడం ప్రారంభించారు. ఆ ఇద్దరి మధ్యా పాత ఎఫైర్ గురించి తిరిగి ప్రచారం మొదలైంది. నేరుగా ఖాన్ పేరు చెప్పకపోయినా కానీ నెటిజనులు చాలా వేగంగా పీసీ మాజీ ఎవరో కనిపెట్టేసారు.




# నాగ చైతన్య - అజిత్.. ప్రైవేట్ ఫైట్!




తెలుగు సినీ పరిశ్రమలో కార్ రేసింగ్ విషయానికి వస్తే మొదటగా గుర్తొచ్చే పేరు నాగ చైతన్య అయితే, తమిళ చిత్ర పరిశ్రమలో అదే తరహాలో రేసింగ్ అంటే ఇష్టపడే హీరో అజిత్ కుమార్. ఇటీవల దుబాయ్ లో అజిత్ కార్ రేసింగ్ లో పాల్గొని తన సత్తా కూడా చాటాడు. అయితే ప్రస్తుతం ఈ ఇద్దరు స్టార్లు ఫిబ్రవరి నెలలో బాక్సాఫీస్ రేస్‌కు సిద్ధమవుతున్నారు. ఈ రెండు సినిమాలు నటీనటుల కెరీర్‌లలో కీలకమైన మలుపుగా నిలవనున్నాయి. అజిత్ ప్రస్తుతం తన కొత్త సినిమా విడా ముయర్చితో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రం ట్రైలర్ గురువారం విడుదల కానుంది. ఫిబ్రవరి 6న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇక మూవీలో అజిత్ తన మార్క్ యాక్షన్‌తో ప్రేక్షకులను అలరించనున్నారు. తెలుగు సంగతి పక్కన పెడితే తమిళ్ లో అంచనాలు అయితే గట్టిగానే ఉన్నాయి. తప్పకుండా అజిత్ మరోసారి కెరీర్ బెస్ట్ ఓపెనింగ్ అందుకునే అవకాశం ఉంది. ఇక మరోవైపు నాగ చైతన్య కూడా బాక్సాఫీస్ రేస్ కు గట్టిగానే రెడీ అవుతున్నాడు తెలుగు లో అస్సలు అజిత్ సినిమా పోటీ కాదు తమిళ్ లో ఎలా ఉంటుంది అన్నదే ఇక్కడ విషయం . అత్యంత ఖరీదైన చిత్రం తండెల్తో బరిలో దిగనున్నాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 7న భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇరువురి సినిమాలు ఒకే సమయానికి రెండు భాషల్లో విడుదల కావడం ఆసక్తిగా మారింది. ఈ సినిమాల ద్వారా అజిత్ తెలుగు మార్కెట్‌ను పెంచుకోవాలని చూస్తుండగా, నాగ చైతన్య తమిళ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అజిత్ ఇప్పటికే తమిళనాట సూపర్‌స్టార్‌గా పేరు సంపాదించగా, నాగ చైతన్య తన సినిమాతో సరికొత్త రికార్డులను సృష్టించాలని భావిస్తున్నారు. ఒక వైపు అజిత్ సినిమా యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఉండగా, చైతన్య సినిమా ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో పాటు దేశానికి సంబంధించిన ఒక మంచి కాన్సెప్ట్ హైలెట్ కాబోతోంది. అసలే దర్శకుడు చందు మొండేటి కార్తికేయ 2తో నేషనల్ వైడ్ గా క్రేజ్ అందుకున్నాడు. కాబట్టి ఈ సినిమాపై తమిళంలో కూడా మంచి హైప్ ఉంది. ఈ రెండు సినిమాలు వేర్వేరు జానర్లకు చెందినవే అయినప్పటికీ, బాక్సాఫీస్ రేస్‌లో ఏది విజయాన్ని అందుకుంటుందో చూడాలి. ఈ రెండు సినిమాల విజయాలు ఇద్దరు హీరోల కెరీర్‌లకు బెస్ట్ మూవీస్ గా నిలిచే అవకాశం ఉంది.

ప్రత్యేకంగా, చైతన్య తన తమిళ డెబ్యూట్ కోసం చేసిన కృషి అభిమానులను మెప్పిస్తుందా? లేదా అజిత్ తన తెలుగు మార్కెట్‌ను విస్తరించుకుంటారా? అన్నది వేచిచూడాల్సి ఉంది.

## 'హిసాబ్ బరాబర్' ట్రైలర్: మరో స్కామ్ గుట్టు విప్పుతున్న మాధవన్




జీ5 ఓటీటీ ప్లాట్ ఫామ్ లో జనవరి 24న విడుదలకు సిద్ధమవుతున్న సినిమా హిసాబ్ బరాబర్. ఆర్. మాధవన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ట్రైలర్ రీసెంట్ గా విడుదలై ఆసక్తి రేకెత్తించింది. ట్రైలర్‌లో కనిపించిన కథ, పాత్రలు, అభినయాలతో సినిమా సరికొత్త అనుభూతిని అందించబోతోందని స్పష్టమైంది. మాధవన్ పోషించిన సామాన్యుడి పాత్ర, ఆర్థిక మోసాల నేపథ్యంతో రూపొందిన కథ, ప్రేక్షకులను ఆశ్చర్యపరచడమే కాకుండా ఆలోచింపజేస్తుంది. హిసాబ్ బరాబర్ ట్రైలర్ కథాంశాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. రాధే మోహన్ శర్మ అనే రైల్వే ఉద్యోగి పాత్రలో మాధవన్ నటన మెప్పించనుంది. బ్యాంకు ఖాతాలో కనిపించిన చిన్న పొరపాటునే జీవితాంతం సమస్యగా మార్చే పరిస్థితులను ట్రైలర్ స్పష్టంగా చూపించింది. ఆర్థిక మోసాలు, అవినీతి, న్యాయం కోసం సామాన్యుడి పోరాటం సినిమా ప్రధాన థీమ్‌గా నిలిచింది. ఈ సినిమాలో నీల్ నితిన్, కీర్తి కుల్హారి వంటి నటి నటుల కీలక పాత్రలు మరింత బలాన్నిస్తాయి. ముఖ్యంగా, మాధవన్ – నీల్ నితిన్ మధ్య సాగే ఆసక్తికరమైన పతాక సన్నివేశాలు ట్రైలర్‌లో హైలైట్ అయ్యాయి. మాధవన్ పాత్రలోని నిబద్ధత, చట్టపరమైన పోరాటానికి సిద్దపడే సామాన్యుడి ధైర్యం కథకు కీలక బలం. అశ్విన్ ధీర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సమాజంలోని ఆర్థిక వ్యవస్థలోని లోపాలను కళ్ళముందు తీసుకువస్తుంది. జియో స్టూడియోస్, ఎస్‌పి సినీకార్ప్ నిర్మించిన ఈ సినిమా టెక్నికల్‌గా కూడా ఉన్నతంగా ఉండబోతోందని ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ట్రైలర్‌లో సీరియస్ డ్రామా, సస్పెన్స్, కామెడీ అన్నీ సమపాళ్ళలో మేళవించబడ్డాయి. మొత్తం సినిమా న్యాయవ్యవస్థ, అవినీతిపై సామాన్యుడి పోరాటాన్ని ఆసక్తికరంగా చూపించనుందని ట్రైలర్ ద్వారా అర్థమవుతుంది. మాధవన్ నటన, కీర్తి కుల్హారి పాత్రలు సినిమాపై మరింత అంచనాలు పెంచుతున్నాయి. సినిమా ఆరంభం నుంచి చివరి వరకూ ఊహించని మలుపులతో ప్రేక్షకులను కట్టిపడేయనుందని అర్థమవుతుంది. ఈ చిత్రం హిసాబ్ బరాబర్ సమాజంలో జరిగిన ఆర్థిక మోసాలు, అవినీతిపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి అనువైన సందేశాన్ని అందించనుంది. సామాన్యుడి కథ, అతని ధైర్యం, న్యాయం కోసం సాగే ప్రయాణం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని భావిస్తున్నారు. మరి రిలీజ్ అనంతరం ఏ స్థాయిలో క్లిక్కవుతుందో చూడాలి.

## వాళ్లు వద్దన్న పాత్రనే ఆమె చేసింది.. ఫలితం?

ఒక హీరో లేదా హీరోయిన్ వద్దన్న పాత్రను ఇంకెవరో చేయడం.. ఆ సినిమా హిట్టయి వాళ్లకు మంచి పేరు రావడం ఇండస్ట్రీలో జరిగే తంతే. ఈ సంక్రాంతికి విడుదలై బ్లాక్ బస్టర్ దిశగా పరుగులు పెడుతున్న సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో కథానాయికగా నటించిన ఐశ్వర్యా రాజేష్ కూడా ఇప్పుడు ఇలాంటి ఆనందంలోనే తేలియాడుతోంది. ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటున్న భాగ్యం పాత్రకు ఫస్ట్ ఛాయిస్ ఐశ్వర్య కాదట. ఈ క్యారెక్టర్ కోసం దర్శకుడు అనిల్ రావిపూడి ముందు ముగ్గురు నలుగురు హీరోయిన్లను సంప్రదించాడట. కానీ వాళ్లెవ్వరూ ఆ పాత్ర చేయడానికి ఒప్పుకోలేదట. అందుక్కారణం.. నలుగురు పిల్లల తల్లిగా నటించాల్సి రావడమే. ఈ విషయాన్ని ఐశ్వర్యనే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఈ విషయం చెప్పొచ్చో లేదో అంటూ అనిల్ దగ్గర అనుమతి తీసుకుని మరీ



వెల్లడించింది ఐశ్వర్య. ఐతే వేరే వాళ్లకు అభ్యంతరంగా మారిన విషయం తనకు అస్సలు సమస్యలా అనిపించలేదని.. పిల్లల తల్లిగా నటించడానికి తనకు ఏ ఇబ్బందీ లేదని ఆమె చెప్పింది. ఈ పాత్రకు తాను ఒప్పుకున్నపుడు.. సినిమా చూశాక తాము ఏం మిస్సయ్యామో ఇంతకుముందు నో చెప్పిన హీరోయిన్లకు అర్థమవుతుందని అనిల్ వ్యాఖ్యానించినట్లు ఆమె తెలిపింది. నిజంగా ఇప్పుడు థియేటర్లలో భాగ్యం పాత్రకు వస్తున్న స్పందన చూసి ఈ పాత్రకు నో చెప్పిన వాళ్లు కచ్చితంగా రిగ్రెట్ అవుతూనే ఉంటారు.

ఈ సినిమా తెలుగులో ఐశ్వర్యకు పెద్ద మలుపు అనే చెప్పాలి. దివంగత నటుడు రాజేష్ తనయురాలైన ఐశ్వర్య తెలుగమ్మాయే అయినా.. తమిళంలో నటిగా మంచి గుర్తింపు సంపాదించింది. ఆ తర్వాత తెలుగులో కౌసల్యా కృష్ణమూర్తి, టక్ జగదీష్, రిపబ్లిక్ లాంటి సినిమాల్లో నటించినా.. అవి విజయం సాధించకపోవడంతో ఆమెకిక్కడ సరైన గుర్తింపు రాలేదు. కానీ సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ కాబోతుండడంతో ఆమె దశ తిరిగినట్లే.

## పింక్ శారీలో పాప అదుర్స్..!

ఇలా వచ్చి అలా రెండు సినిమాలకే స్టార్ క్రేజ్ తెచ్చుకున్న ముద్దుగుమ్మ శ్రీలీల ధమాకా హిట్ తో సెన్సేషనల్ అనిపించగా ఆ క్రేజ్ తో ఒకేసారి ఐదారు సినిమాల ఆఫర్లు అందుకుంది. ఇంకేముందు ఇక కెరీర్ కు తిరుగులేదని అనిపించగా వరుస ఫ్లాపులు శ్రీలీల గ్రాఫ్ పడిపోయేలా చేశాయి. ఐతే కథల విషయంలో కాస్త ఆచి తూచి అడుగు వేయాలని తర్వాత తెలుసుకున్న అమ్మడు ఇప్పుడు మళ్లీ వరుస ఆఫర్లు అందుకుంటుంది. ప్రస్తుతం నితిన్ రాబిన్ హుడ్ రవితేజాతో మాస్ జాతర సినిమాల్లో నటిస్తుంది శ్రీలీల. ఈ రెండు సినిమాలతో తిరిగి ఫాంలోకి రావాలని చూస్తుంది శ్రీలీల. ఐతే ఆడియన్స్ కు కేవలం సినిమాలతోనే కాదు తన ఫోటో షూట్స్ తో కూడా మంచి



ట్రీట్ ఇస్తుంది శ్రీలీల. లేటెస్ట్ గా పింక్ శారీలో శ్రీలీల స్టిల్స్ అదిరిపోయాయి. పింక్ శారీలో అమ్మడి లుక్స్ కుర్రాళ్లను క్లీన్ బౌల్డ్ చేస్తున్నాయి. శారీలో కూడా ఫోటో షూట్ చేసి ఫాలోవర్స్ ని పిచ్చెక్కిస్తుంది శ్రీలీల. ఫోటో షూట్ అంటే స్కిన్ షో చేయాలన్న సమీకరణాలు మార్చేస్తుంది అమ్మడు. ఇలా శారీ లుక్స్ తో కూడా ఎట్రాక్ట్ చేస్తుంది. సినిమాలు, ఫోటో షూట్స్ ఇవి రెండు పార్లర్ గా కథానాయికల కెరీర్ ను తీసుకెళ్తాయి. ఒక్కోసారి సినిమాలు ఫ్లాప్ అయ్యి వారి కెరీర్ రిస్క్ లో పడినా కూడా ఈ ఫోటో షూట్స్ వారికి మంచి పాపులారిటీ తెచ్చేలా చేస్తాయి. శ్రీలీల ఏం చేసినా దానికో లెక్క ఉంటుంది అనిపించేలా ఫోటో షూట్స్ లో కూడా తన స్పెషాలిటీ చూపిస్తుంది అమ్మడు. పింక్ శారీ.. స్లీవ్ లెస్ జాకెట్.. లూజ్ హెయిర్ అబ్బా ఒకసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలని అనిపించేలా శ్రీలీల లుక్స్ బ్యూటిఫుల్ అంటూ క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు నెటిజన్లు. సోషల్ మీడియాలో ఏదో ఒక విధంగా సందడి చేస్తున్న ఈ అమ్మడు సినిమాలు కూడా హిట్లు పడితే మాత్రం టాప్ లీగ్ లోకి వచ్చి కొన్నాళ్లు తిరుగులేని విధంగా స్టార్ ఇమేజ్ తెచ్చుకుంటుందని చెప్పొచ్చు. నితిన్, రవితేజ సినిమాలే కాదు పవర్ స్టార్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా కూడా లైన్ లో ఉంది. ఆ సినిమాతో కూడా శ్రీలీల తన సత్తా చాటేలా ఉంది.







## దిల్లీ ఎన్నికలు.. కీలక హామీల పోస్టర్లు విడుదల చేసిన రేవంత్‌రెడ్డి

దిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలకు సంబంధించి పోస్టర్లను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. దిల్లీలో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని.. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను తాము నెరవేర్చుతున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. "తెలంగాణలో మేము ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నాం. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. విజయవంతంగా ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో 55 వేల ఉద్యోగాలు కల్పించాం. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోంది. దిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలి" అని రేవంత్‌రెడ్డి కోరారు.

**కాంగ్రెస్ ఎన్నికల హామీలు..** రూ.500లకే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్, 300 యూనిట్ల ఉచిత కరెంట్, ఉచిత రేషన్ కిట్లు, యువ ఉడాన్ యోజన: ఏడాదిపాటు నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.8,500, ప్యారీ దీదీ యోజన: మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, జీవన్ రక్ష యోజన: రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా 70 శాసనసభ స్థానాలు ఉన్న దిల్లీకి ఒకేవిడతలో ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ముంబయి: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగింది. ఓ గుర్తుతెలియని వ్యక్తి నటుడి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో సైఫ్ గాయపడగా కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు ముంబయి లోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు దొంగతనానికి యత్నించాడు. అతడిని గమనించిన నటుడు అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. దాడి చేసి పరారైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దుండగుడిని పట్టుకునేందుకు పలు బృందాలను ఏర్పాటు చేశారు. దొంగతో జరిగిన ఘర్షణలో నటుడికి ఆరు చోట్ల కత్తి గాయాలయ్యాయి. రెండు చోట్ల లోతుగా గాయమైనట్లు వైద్యులు వెల్లడించారు. ఘటనపై నటుడి టీమ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "సైఫ్ అలీ ఖాన్ ఇంట్లో చోరీకి యత్నం జరిగింది. ప్రస్తుతం నటుడికి ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరుగుతోంది. ఈ విషయంపై అభిమానులు, మీడియా సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇది పోలీసు కేసుకు సంబంధించిన వ్యవహారం. పరిస్థితిపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తాం" అని వెల్లడించింది.




తమ పార్టీలో గెలిచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల విషయంపై బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. ముగ్గురు ఎమ్మెల్యేలపై ఎస్ఎల్పీ, ఏడుగురు ఎమ్మెల్యేలపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్, సెక్రటరీలు వెంటనే చర్యలు తీసుకునేలా, టైం ఫిక్స్ చేసేలా ఆదేశించాలని కోరారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది బీఆర్ఎస్. మిగతా ఏడుగురిపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చి ఆరు నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని పిటిషన్లో పేర్కొంది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. దీంతో సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వబోతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

**పార్టీ మారిన ఎమ్మెల్యేలపై పోరాటం..** అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి విజయం సాధించిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీ మారిన వారిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఉన్నారు. ఇందులో దానం నాగేందర్ ఏకంగా కాంగ్రెస్ బీఫామ్ పై సికింద్రాబాద్ ఎంపీగా సైతం పోటీ చేశారు. ఈ నేపథ్యంలో వీరిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తోంది. స్పీకర్ కు కంప్లైంట్ తో పాటు హైకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు ఖాయమని.. వారి స్థానాల్లో ఉప ఎన్నికలు తప్పకుండా వస్తాయని బీఆర్ఎస్ టాప్ లీడర్లు అనేక సార్లు చెబుతూ వస్తున్నారు.

## కేసీఆర్‌పై సంచలన ఆరోపణలు చేసిన సీఎం రేవంత్



ఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇవాళ(గురువారం) ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల గ్యారెంటీ పోస్టర్లను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, సురేష్ షెట్కార్, షబ్బీర్ అలీ, సంపత్, ఢిల్లీ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడారు. అవినీతిని అడ్డుకుంటే చాలు ఆ నిధులు పేదలకు పంచవచ్చని చెప్పారు. తెలంగాణలో అదే చేశామని అన్నారు. కేసీఆర్ తెలంగాణను దోచుకున్నారని మండిపడ్డారు. పెట్టబడుల కోసం దావోస్ వెళ్తున్నాం, వచ్చాక ఎన్ని నిధులు తీసుకొచ్చామో చెబుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేజ్రీవాల్ లిక్కర్ పార్టనర్ బీఆర్ఎస్‌ను తెలంగాణలో ఓడించామని చెప్పారు. ఇప్పుడు ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని స్పష్టం చేశారు. తెలంగాణలో విజయవంతంగా ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. తెలంగాణలో 55 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. తెలంగాణలో మహిళల కోసం ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. తెలంగాణలో తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని సీఎం రేవంత్ తెలిపారు. ఢిల్లీ ప్రజలకు రెండు గ్యారంటీ హామీలు ఇస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీ ఇస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం సోనియా గాంధీ ఎంతో కృషి చేశారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పార్టీకి చాలా నష్టం జరిగినా సరే.. హామీ నిలబెట్టుకున్నారు తప్ప వెనుకడుగు వేయలేదని ఉద్ఘాటించారు. షీలా దీక్షిత్ సీఎంగా ఉన్నప్పుడు మాత్రమే ఢిల్లీలో అభివృద్ధి జరిగింది తప్ప ఆ తర్వాత పరిస్థితి ఎలాంటి దుస్థితికి చేరుకుందో చూడాలని అన్నారు. ఢిల్లీలో అడుగు పెట్టాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇటు సీఎంగా కేజ్రీవాల్, అటు పీఎంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీకి చేసింది ఏమీ లేదని విమర్శించారు. అబద్ధాలు ఆడటంలో ప్రధాని మోదీ, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ ఒకటేనని ఎద్దేవా చేశారు. ఇద్దరూ కలిసి ఢిల్లీని నాశనం చేశారని, ఇద్దరూ వేర్వేరు కాదు. ఒక్కటేనని విమర్శించారు.

ఢిల్లీని బాగుచేయాలి అంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సి ఉందేనని అన్నారు. వాతావరణ కాలుష్యమే కాదు, రాజకీయ కాలుష్యాన్ని కూడా ఈ ఇద్దరూ కలిసి పెంచారని మండిపడ్డారు. తెలంగాణలో అమలు చేస్తున్న మాదిరిగానే ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఇచ్చిన హామీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## అధికారులు నిబద్ధతతో పనిచేయాలి.. మంత్రి సీతక్క కీలక ఆదేశాలు



హైదరాబాద్: అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయాలని అన్నారు. అధికారుల మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఇవాళ(గురువారం) తెలంగాణ సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారులు నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. శాఖపరంగా వాస్తవాలనే నివేదించాలని అన్నారు. మంత్రుల మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దని చెప్పారు. అధికారులు, అమాత్యులు వేర్వురు కాదన్నారు. మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దని చెప్పారు. ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దని అన్నారు. మీ కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. రూ. 300 కోట్ల ఎన్ఆర్ఈజీఏ బిల్లులను నిన్న విడుదల చేశామని మంత్రి సీతక్క అన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలని అన్నారు. అర్హులైన ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారికి పోషకాహారం అందించాలని అన్నారు. ఆ దిశలో జిల్లా సంక్షేమ అధికారులను సిద్ధ%శీ% చేయాలని చెప్పారు. అంగన్వాడీ సేవలపై చిన్నారుల పేరెంట్స్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు. ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్వాడీకి వచ్చే గర్భిణులు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్వాడి కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని డ్రైవ్ నిర్వహించి దివ్యాంగులకు పరికరాలను అందజేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పెడుతున్న కేసులు.. మా ఘనతను తుడిచేయలేవు: కేటీఆర్



హైదరాబాద్: ఈడీ విచారణకు హాజరయ్యే ముందు 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-రేసు నిర్వహణ అనేది తాను మంత్రిగా తీసుకున్న అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్ణయాల్లో ఒకటని అన్నారు. ఆనాడు రేసర్లు అందరూ హైదరాబాద్ నగరాన్ని కీర్తించారని తెలిపారు. తనకెప్పుడూ హైదరాబాద్ బ్రాండ్ ముఖ్యమన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఆ ఘనతను తుడిచేయలేవని చెప్పారు. "పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది...? మనీ లాండరింగ్ ఎక్కడిది? ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు.. ప్రతి పైసాకు లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారు. కచ్చితంగా ఈ అంశంలో నిజమే గెలుస్తుంది. సీఎం రేవంత్ రెడ్డికి దూరదృష్టి లేకపోవడం వల్లే ఏకపక్షంగా తరువాతి సీజన్ రద్దు చేశారు. తప్పు లేకపోయినా ఏదో కాలం వెల్లదీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. తప్పకుండా త్వరలోనే నిజం తెలుస్తుంది" అని కేటీఆర్ తెలిపారు.



## కేటీఆర్ ఈడీ విచారణ.. భాజపా, కాంగ్రెస్ కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తు

హైదరాబాద్: ఫార్ములా ఈ రేసు కేసులో మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఈడీ విచారిస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయమైన గాంధీ భవన్ వద్ద భారీ బందోబస్తు చేపట్టారు. కొంత మంది భారాస కార్యకర్తలు గాంధీభవన్‌ను ముట్టడించే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఇక్కడ భద్రతను పెంచారు. కార్యాలయం నాలుగు గేట్ల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఈడీ విచారణ పూర్తయ్యే వరకూ ఇక్కడ భద్రతను పటిష్ఠం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పోలీసులు మోహరించారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది అక్కడ మోహరించారు. బాష్పవాయువు, వాటర్‌కెనాన్ల వాహనాలను పోలీసులు తెప్పించారు

## ఫార్ములా-ఈ రేస్ కేసు.. 18న విచారణకు రావాలని ఏస్ నెక్ట్స్‌జెన్‌కు ఏసీబీ నోటీసులు

హైదరాబాద్: ఫార్ములా-ఈ రేస్ కేసులో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మలివిడత విచారణకు సిద్ధమైంది. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని విచారించిన విషయం తెలిసిందే. రేస్ నిర్వహణలో తొలి ప్రమోటర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ వ్యవహారంపైనా దృష్టి సారించింది. ఈనెల 18న విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది. 2022 అక్టోబరు 25న జరిగిన తొలి ఒప్పందం ప్రకారం సీజన్ 9, 10, 11, 12 రేస్‌ల నిర్వహణ ఖర్చులను ఏస్ నెక్ట్స్‌జెన్ భరించాలి. హైదరాబాద్‌లో 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సీజన్-9 రేస్ జరిగింది. అనంతరం 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన సీజన్-10 రేస్ కోసం ఫార్ములా-ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈవో) సంస్థకు 2023 మేలోనే 50% సొమ్ము(రూ.90 కోట్లు) చెల్లించాల్సి ఉన్నా ఏస్ నెక్ట్స్‌జెన్ ముందుకు రాలేదు. సీజన్-9తో తమకు నష్టం వాటిల్లిందంటూ చేతులెత్తేసింది. దాంతో ప్రమోటర్ పాత్రను హెచ్ఎండీఏనే పోషించాలని అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశించడంతో 2023 అక్టోబరు 5, 11 తేదీల్లో రూ.45.71 కోట్లను ఎఫ్ఈవోకు హెచ్ఎండీఏ బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు వివాదానికి కారణమైంది. తన బాధ్యత నుంచి తప్పుకొన్న ఏస్ నెక్ట్స్ జెన్ మీద ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపైనా ఏసీబీ ఆరా తీస్తోంది.

## ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్.. కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్: ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట హాజరయ్యారు. అంతకుముందు ఆయన గచ్చిబౌలిలోని నివాసం నుంచి బయలుదేరి.. నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు. సుమారు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. బాష్పవాయువు, వాటర్‌కెనాన్ల వాహనాలను పోలీసులు తెప్పించారు. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు. ఫార్ములా-ఈరేస్‌లో నిబంధనల ఉల్లంఘనపై ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

**ఈడీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత :** మరోవైపు ఈడీ కార్యాలయానికి పెద్దసంఖ్యలో భారాస కార్యకర్తలు చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఇదే కేసులో నిందితులుగా ఉన్న అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. మరోవైపు ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ కేటీఆర్ వేసిన పిటిషన్‌ను సైతం బుధవారం 'డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో ఈడీ విచారణకు ప్రాధాన్యం ఏర్పడింది.

## నుమాయిష్‌కు మూడురోజుల్లో 2.21లక్షల మంది..




హైదరాబాద్: సంక్రాంతి పండుగ వరుస సెలవుల నేపథ్యంలో సిటీ జనం నుమాయిస్?కు క్యూ కడుతున్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 84వ నుమాయిష్‌కు సోమవారం(భోగి రోజు) - 75,250, సంక్రాంతి రోజు-76500, బుధవారం కనుమ రోజు 69,300 మంది నుమాయిష్‌ను సందర్శించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్ తెలిపారు. మూడు రోజుల్లో మొత్తం 2,21,050 మంది సందర్శకులు నుమాయిష్‌లో పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లోని అన్ని స్టాల్స్ జనసంద్రంగా కనిపించడంతో పాటు సందడి వాతావరణం నెలకొంది. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన మినీ ట్రైన్ ఎక్కేందుకు జనం బారులు తీరారు. అమ్యూజ్‌మెంట్ రైడ్స్ ఎక్కేందుకు పిల్లలు పోటీపడ్డారు. పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో మరో మూడు రోజుల్లో సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com